# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No:-37ACDFM5465G1Z1

సంపుటి : 1 సంచిక : 368 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : మహేష్ యాదవ్ 27-12-2025 పేజీలు : 12 వెల రూ.3/






ఏపీఎస్ ఆర్టీసీకి భారీ ఊరట

'సూపర్ సిక్స్' హామీ అమలులో భాగంగా నిధుల కేటాయింపు

## స్త్రీ శక్తి పథకానికి

# రూ. 800 కోట్లు

- మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకానికి రూ.800 కోట్లు విడుదల
- ఇప్పటివరకు ఈ పథకానికి మొత్తం రూ.1200 కోట్లు కేటాయింపు
- సంస్థపై ఆర్థిక భారం పడకుండా చూస్తామన్న రవాణా శాఖ మంత్రి

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో మహిళల కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రూ.800 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు రవాణా శాఖకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల హామీ అయిన 'సూపర్ సిక్స్' అమలులో భాగంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిధులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)కు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఏడాది ఆగస్టు 15న విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డకు పెద్దన్నగా ఇస్తున్న కానుక ఇదని, మహిళలు రూపాయి చెల్లించకుండా రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించవచ్చని ఆయన

మిగతా 2లో



## నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

- సీఎం చంద్రబాబు స్ట్రిక్ట్ వార్నింగ్
- తిరుపతిలో నూతన జిల్లా పోలీసు కార్యాలయం ప్రారంభం హాజరైన సీఎం చంద్రబాబు
- రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- తిరుమల పవిత్రతను కాపాడాలని పోలీసులకు దిశానిర్దేశం
- టెక్నాలజీతో నేరాలను అదుపు చేయాలని పిలుపు

2

## 16 ఏళ్లలోపు వారికి ఇంటర్నెట్ నిషేధం

- ఆస్ట్రేలియా తరహాలో చట్టం తీసుకురావచ్చేమో పరిశీలించండి ... కేంద్రానికి మద్రాస్ హైకోర్టు సూచన

2



## 20 మంది వీర బాలలకు పురస్కారాల ప్రదానం



- బహూకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- అవార్డులు అందుకున్న వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విశ్వనాథ్, శివాని

వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన పిల్లలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారా'లను బహూకరించారు. ధైర్యసాహసాలు, సామాజిక సేవలు, పర్యావరణం, క్రీడలు, కళలు-సంస్కృతి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అసాధారణ విజయాలను సాధించినందుకు వీటిని అందజేశారు. వీర్ బాల్ దివస్‌ను పురస్కరించుకొని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 18 రాష్ట్రాలకు చెందిన 20 మంది పిల్లలకు వీటిని ప్రదానం చేశారు.

2



ఢిల్లీకి బయలుదేరిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

2



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

## అభివృద్ధి వదిలేసి బూతులు తిట్టుకుంటున్నారు

- తెలంగాణలో అభివృద్ధిపై చర్చ జరగడం లేదన్న బండి సంజయ్
- అధికార, ప్రతిపక్షాలు బూతుల పురాణం అందుకున్నాయని విమర్శ
- ప్రజలు పాలన కోరుకుంటే గలీజ్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణ

**హైదరాబాద్**

ఉద్యోగాలు, పెట్టుబడులే రాష్ట్రావసరమన్న కేంద్ర సహాయ మంత్రి తెలంగాణలో అభివృద్ధి పూర్తిగా పక్కదారి పట్టిందని, అధికార, ప్రతిపక్ష పార్టీలు కేవలం బూతులు తిట్టుకోవడానికే పరిమితమయ్యాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి, జవాబుదారీతనం అనేవే లేకుండా పోయాయని, కేవలం వ్యక్తిగత దూషణలు తప్ప మరేమీ లేవని ఆయన ఆరోపించారు. ఈ

## కల్తీ మద్యం కేసులో కీలక మలుపు..

ఐదుగురు నిందితుల విచారణకు

# కోర్టు గ్రీన్ సిగ్నల్



- నకిలీ మద్యం కేసులో ఐదుగురు నిందితులకు కస్టడీ
- మూడు రోజుల పాటు విచారించనున్న సిట్ అధికారులు
- తంబళ్లపల్లి కోర్టు అనుమతితో పోలీసుల అదుపులోకి నిందితులు
- మదనపల్లె సబ్‌జైల్ నుంచి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలింపు

2

## రైతు భరోసాకు కొత్త రూల్స్..

- ఇకపై సాగు చేసేవారికే పెట్టుబడి సాయం
- సంక్రాంతి కానుకగా యాసంగి రైతు భరోసా నిధులు
- ఈసారి కొత్త నిబంధనలు.. శాటిలైట్‌తో భూముల పరిశీలన
- పంట సాగు చేసే నిజమైన రైతులకే పెట్టుబడి సాయం
- సాగులో లేని భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు కోత
- అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై అధికారిక ప్రకటనకు అవకాశం




2

# నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

**తిరుమల**

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడటం, దేశ విదేశాల నుంచి తరలివచ్చే కోట్లాది మంది భక్తులకు పూర్తిస్థాయి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని, రాజకీయ ముసుగులో రౌడీయిజం, అరాచకాలకు పాల్పడితే ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రాష్ట్రం నుంచి బహిష్కరిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. శుక్రవారం తిరుపతిలో అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని (డీపీఓ) ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన, నూతన కార్యాలయంలోని వసతులను పరిశీలించి, విజిటర్స్ పుస్తకంలో తన సందేశాన్ని రాశారు. కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, ఇక్కడికి వచ్చే భక్తులలో భద్రతా భావాన్ని కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని అన్నారు. ముఖ్యంగా వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల సమయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో ఆధునిక టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచి, కీలక ఆధారాలను సేకరించాలని, నేరస్తుల ఆలోచనల కన్నా ఓ అడుగు ముందుండాలని పిలుపునిచ్చారు. 'విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీస్' అనే విధానాన్ని అనుసరించి, ప్రజలకు భరోసా ఇస్తూనే నేరగాళ్ల కదలికలను పసిగట్టాలని స్పష్టం చేశారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయని చంద్రబాబు విమర్శించారు. కొందరు రాజకీయ అండతో చెలరేగిపోయారని, సమాజంలో భయాన్ని సృష్టించే సంస్కృతిని ప్రోత్సహించారని ఆరోపించారు.

"రోడ్లు బ్లాక్ చేయడం, కత్తులతో జంతువులను బలిచ్చి ఆ రక్తంతో పోస్టర్లు నింపడం వంటి భయానక వాతావరణాన్ని సృష్టించారు. బంగారుపాళ్యంలో మామిడి కాయలు తొక్కించడం, గుంటూరులో ఒక వ్యక్తిని కాన్వాయ్ కింద తొక్కించి పొదల్లో పడేసి, తర్వాత అంబులెన్స్‌లో తీసుకెళ్లి చంపేయడం వంటి అమానవీయ ఘటనలు చూశాం. ఇలాంటివి పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధారాలు పక్కాగా సేకరించాలి" అని పోలీసులకు సూచించారు.

**అక్రమార్కులపై కఠిన వైఖరి**

అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ నాయకులనైనా జైలుకు పంపిన చరిత్ర తమదని గుర్తుచేశారు. సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ, అసభ్యకరమైన పోస్టులు పెట్టేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నేతలు ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడటం లేదని, కేవలం కొందరు రాజకీయ లబ్ధి కోసమే ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని విమర్శించారు. ఇదే సమయంలో, తిరుపతి జిల్లాలో గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను సమర్థవంతంగా అరికడుతున్న పోలీసు సిబ్బందిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పీడీ యాక్టులను ప్రయోగించి నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న తీరును కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 20 మంది వీర బాలలకు పురస్కారాల ప్రదానం

**న్యూఢిల్లీ, డిసెంబరు 26**

వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన పిల్లలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారా'లను బహూకరించారు. ధైర్యసాహసాలు, సామాజిక సేవలు, పర్యావరణం, క్రీడలు, కళలు-సంస్కృతి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అసాధారణ విజయాలను సాధించినందుకు వీటిని అందజేశారు. వీర్ బాల్ దివస్‌ను పురస్కరించుకొని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 18 రాష్ట్రాలకు చెందిన 20 మంది పిల్లలకు వీటిని ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పర్వతరోహకుడు విశ్వనాథ్ కార్తికేయ్, ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాకు చెందిన 17 ఏళ్ల పారా అథ్లెట్ క్రీడాకారిణి శివాని హోసూరు ఉప్పర ఉన్నారు. రికార్డులు సృష్టిస్తున్న క్రికెట్ క్రీడాకారుడు వైభవ్ సూర్యవంశీ కూడా పురస్కారం అందుకున్నాడు.

**విశ్వనాథ్ పేరిట 4 ప్రపంచ రికార్డులు**

తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పడకంటి విశ్వనాథ్ కార్తికేయ్ పర్వతరోహకుడు. ఈ ఏడాది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడం ద్వారా 'సెవెన్ సమ్మిట్స్' ఛాలెంజ్‌ను పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడైన భారతీయుడిగా నిలిచాడు. విశ్వనాథ్ పేరిట నాలుగు ప్రపంచ రికార్డులు ఉన్నాయి. అందులో ఎల్‌బ్రూస్ పర్వతాన్ని కేవలం 24 గంటల్లోనే ధిరోహించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు కూడా ఒకటి. విశ్వనాథ్ ఆరు ఖండాల్లోని 20కి పైగా పర్వతాలను అధిరోహించాడు.

**పారా అథ్లెటిక్స్‌లో శివాని సత్తా..**

దివ్యాంగురాలైన ఏపీకి చెందిన 17 ఏళ్ల శివాని థాయ్‌లాండ్‌లో జరిగిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ గేమ్స్(2023) అండర్ 20 విభాగంలో జావెలిన్ ఎఫ్45, షాట్‌పుట్ క్రీడల్లో విజేతగా నిలిచింది. గతేడాది బెంగళూరులో నిర్వహించిన నేషనల్ జూనియర్ అండ్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స అండర్ 17 విభాగంలో 100 మీటర్ల పరుగు, జావెలిన్ త్రో, షాట్ పుట్‌లో మూడు బంగారు పతకాలను గెలిచింది. 12వ నేషనల్ ఛాంపియన్‌షిప్స(2023) మహిళల జావెలిన్ త్రోలో రజత పతకం సాధించింది.

**ఆపరేషన్ సిందూర్‌లో 'చిట్టి పౌర యోధుడు'**

ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశానికి తన వంతు సేవలు అందించి సైనికుల ప్రశంసలు అందుకున్న ఓ పదేళ్ల బాలుడు ఇప్పుడు రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నాడు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా చక్ తరన్ వాలీ గ్రామానికి చెందిన శ్రావణ్ సింగ్.. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సైనికులకు నీరు, పాలు, టీ, లస్సీ అందజేశాడు. బాలుడి దేశభక్తిని చూసి సైనికులు మురిసిపోయారు. 'యంగెస్ట్ సివిల్ వారియర్' పేరుతో సన్మానించారు.

**జెన్-జీతో వికసిత్ భారత్ సాకారం : ప్రధాని మోదీ**

జెన్-జీపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, వారి సామర్థ్యాలు, క్రమశిక్షణ, కష్టపడే తత్వం వికసిత్ భారత్ కలను సాకారం చేస్తాయని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన 'వీర్ బాల్ దివస్' కార్యక్రమంలో మోదీ పాల్గొని మాట్లాడారు. యువత కలలు, ఆకాంక్షలే దేశ దశ, దిశను నిర్ణయిస్తాయని అభిప్రాయపడ్డారు. యువత స్వల్పకాలిక ఆకర్షణల మోజులో పడకుండా లక్ష్యం వైపు దూసుకెళ్లాలని సూచించారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక యువతకు ఎన్నో రంగాల్లో అవకాశాలను కల్పించామని ఆయన చెప్పుకొచ్చారు. ఎవరు పెద్ద.. ఎవరు చిన్న అనేది వయసు నిర్ణయించదని, చేసే పనులు సాధించే విజయాలే నిర్ణయిస్తామన్నారు.

# అభివృద్ధి వదిలేసి బూతులు తిట్టుకుంటున్నారు

మొదటిపేజీ తరువాయి

సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజా సమస్యలను గాలికొదిలేసి, అసభ్య పదజాలంతో పరస్పరం దూషించుకుంటున్నారు. పాలనలో చూపించడానికి ఏమీ లేనప్పుడే నాయకులు ఇలాంటి వ్యక్తిగత విమర్శలకు దిగుతారు. భాష గురించి నీతులు చెప్పే పార్టీలే ఇప్పుడు రాజ్యాంగ వేదికల నుంచి బూతులు మాట్లాడుతున్నాయి" అని అన్నారు.

ప్రజలు సుపరిపాలన కోసం ఓటు వేస్తే, 2014 నుంచి రాష్ట్రంలో గలీజ్ రాజకీయాలు తప్ప మరేమీ చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు కావాల్సింది ఉద్యోగాలు, పెట్టుబడులు, రైతులకు మద్దతు, మెరుగైన పట్టణ మౌలిక సదుపాయాలని, కానీ రోజూ అధికార, ప్రతిపక్షాల మధ్య తిట్ల పోటీలు కాదని బండి సంజయ్ హితవు పలికారు.

# ఢిల్లీకి బయలుదేరిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

**ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో రేపు ఉదయం సీడబ్ల్యూసీ కీలక సమావేశం**

**మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం**

**దేశంలోని రాజకీయ పరిస్థితులు సహా వివిధ అంశాలపై చర్చించనున్న సీడబ్ల్యూసీ**

**హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీకి పయనమయ్యారు. రేపు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటున్నారు. ఢిల్లీలో నూతనంగా నిర్మించిన ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్‌లో రేపు ఉదయం 10.30 గంటలకు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో, దేశవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ పరిస్థితులు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, రాబోయే ఎన్నికలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు సమాచారం. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

# రైతు భరోసాకు కొత్త రూల్స్..

**హైదరాబాద్**

తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించేందుకు సిద్ధమవుతోంది. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని సంక్రాంతి పండుగ కానుకగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. అయితే, ఈసారి పథకం అమలులో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. కేవలం పంటలు సాగు చేసే నిజమైన రైతులకే ప్రయోజనం చేకూరేలా పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. గతంలో సాగు చేయని భూములకు కూడా నిధులు అందుతున్నాయన్న విమర్శల నేపథ్యంలో, ఈసారి ప్రభుత్వం టెక్నాలజీ సాయం తీసుకుంటోంది. ఉపగ్రహ చిత్రాల ద్వారా వ్యవసాయ భూములను క్షుణ్ణంగా పరిశీలించి, డిజిటల్ మ్యాపింగ్ ద్వారా ఏ పొలంలో పంట ఉందో, ఏది ఖాళీగా ఉందో గుర్తిస్తున్నారు. దీనివల్ల సాగులో లేని బంజరు భూములు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా నిలిచిపోనుంది. ఈ చర్యతో ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడమే కాకుండా, అర్హులైన రైతులకే లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి రూ. 18,000 కోట్లు కేటాయించింది. గత వానాకాలం సీజన్‌లో సుమారు 69 లక్షల మంది రైతులకు రూ. 9,000 కోట్లను కేవలం 9 రోజుల్లోనే జమ చేసింది. ఇప్పుడు యాసంగికి కూడా జనవరి రెండో వారం నాటికి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి, పండుగలోపు నిధులు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# స్త్రీ శక్తి పథకానికి రూ.800 కోట్లు విడుదల..

మొదటిపేజీ తరువాయి

ఆనాడు ప్రకటించారు. పథకం ప్రారంభమైన నాటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగింది. ఈ పథకం అమలు కారణంగా ఆర్టీసీపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని ప్రభుత్వం ముందునుంచీ స్పష్టం చేస్తోంది. ఇందులో భాగంగానే ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు అయిన ఖర్చుల కోసం నవంబర్ 13న తొలి విడతగా రూ.400 కోట్లను విడుదల చేసింది. తాజాగా మరో రూ.800 కోట్లను విడుదల చేయడంతో ఆర్టీసీకి భారీ ఊరట లభించింది. జీరో టికెట్ ప్రయాణికుల ఛార్జీలను 100% రీయింబర్స్‌మెంట్ చేస్తామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఇదివరకే తెలిపారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం ఈ పథకానికి ఏటా సుమారు రూ.1,942 కోట్లు ఖర్చవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. తాజాగా విడుదలైన నిధులతో డీజిల్, సిబ్బంది జీతాలు వంటి నిర్వహణ ఖర్చులకు ఇబ్బందులు తొలగిపోతాయని ఆర్టీసీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పథకం అమలు తీరుపై రవాణా శాఖ మంత్రి జనవరి 2026లో సమీక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

# 16 ఏళ్లలోపు వారికి ఇంటర్నెట్ నిషేధం

**చెన్నై, డిసెంబరు 26**

ఆస్ట్రేలియా తరహాలో 16 ఏళ్లలోపు చిన్నారులకు ఇంటర్నెట్ వినియోగం నిషేధించేలా ప్రత్యేక చట్టం చేయడంపై పరిశీలించాలని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం కేంద్రప్రభుత్వానికి సూచించింది. అంతేగాక సోషల్ మీడియాపై అవగాహనా ప్రచారాన్ని సమర్థవంతంగా చేయాలని ఆదేశించింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం అమలు చేసిన లాంటి చట్టం మన దేశంలో కూడా అమలులోకి వచ్చే వరకు అందుబాటులో ఉన్న అన్ని మీడియాల ద్వారా అవగాహన కల్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్‌లతో కూడిన మదురై ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అశ్లీల చిత్రాలు సులువుగా అందుబాటులో ఉంటున్న ఇంటర్నెట్‌ను చిన్నారులు వీక్షించకుండా చర్యలు చేపట్టాలంటూ విజయ్‌కుమార్ అనే సామాజిక సేవా కార్యకర్త దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై స్పందించిన ధర్మాసనం ఈ మేరకు సూచనలు చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇంటర్నెట్‌లో అశ్లీల చిత్రాలు పుంఖానుపుంఖాలుగా అందుబాటులో ఉంచుతున్నారని, అలాంటి చిత్రాలను ఎవరైనా సులువుగా చూసే అవకాశం ఉందని వివరించారు. దీని వల్ల చిన్నారుల భవిష్యత్తు పాడవుతుందని, చిన్నారుల సంరక్షణ చట్టాల ప్రకారం ఇలాంటి అశ్లీల చిత్రాలను నిషేధించేలా చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. చిన్నారులు ఇలాంటి అశ్లీల చిత్రాలు చూడకుండా ఉండేలా కొత్త సాఫ్ట్‌వేర్ ప్రవేశపెట్టాల్సిన అవసరముందని, ఈ చిత్రాలు వీక్షించడం ద్వారా వారి మానసిక స్థితి పక్కదోవ పట్టే అవకాశముందని అభిప్రాయపడింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం తరహాలో 16 ఏళ్లలోపు వారు ఇంటర్నెట్ చూడకుండా ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరముందని సూచించింది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. పిల్లల హక్కుల పరిరక్షణకు అవగాహన కల్పించడం జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్, తమిళనాడు బాలల హక్కుల రక్షణ కమిషన్ చట్టబద్ధమైన విధి అని స్పష్టం చేసింది.

## కల్తీ మద్యం కేసులో కీలక మలుపు..

# ఐదుగురు నిందితుల విచారణకు కోర్టు గ్రీన్ సిగ్నల్

**అమరావతి**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. ఈ కేసులోని ఐదుగురు ప్రధాన నిందితులను మూడు రోజుల కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లి కోర్టు అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాలతో ఎక్సైజ్ పోలీసులు ఈరోజు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

వివరాల్లోకి వెళితే.. ఈ కేసులో ఏడుగురు నిందితులను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఐదుగురు నిందితులను మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మదనపల్లె సబ్‌జైల్లో రిమాండ్‌లో ఉన్న ఏ1 అద్దేపల్లి జనార్దన్ రావు, ఏ26 జగన్మోహన్ రావు, ఏ28 తాండ్ర రమేశ్, ఏ27 తిరుమలశెట్టి శ్రీనివాసరావు, ఏ29 షేక్ అల్లబక్షులను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.

కస్టడీకి తీసుకున్న వెంటనే నిందితులకు వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత వారిని విచారణ నిమిత్తం మదనపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించనున్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు వీరిని ప్రశ్నించి కీలక సమాచారం రాబట్టే అవకాశం ఉంది. ఈ విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి రావచ్చని అధికారులు భావిస్తున్నారు.

# జిల్లాలో పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**- 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ను పటిష్ఠంగా అమలు చేయాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**






**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** జిల్లాలో పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధిం చేలా 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ను పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు.శుక్ర వారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పద వ తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, మెంటార్ లుగా నియమించిన జిల్లా,డివిజన్, మండల స్థా యి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొదట పదవ తరగతి విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా చూడాలని, డ్రాప్ అవుట్ లు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రధానంగా ఆదోని డివిజన్ లో డ్రాపౌట్ ల శాతం ఎక్కువగా ఉందని, తల్లిదండ్రులతో పాటు వలస వెళ్లిన విద్యార్థులను వెనక్కు రప్పించి హాస్టల్ లో చేర్పించి, స్కూల్ కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏబి గ్రేడ్ విద్యార్థులను షైనింగ్ స్టార్స్ గా, సి, డి గ్రేడ్ విద్యార్థులు (రైజింగ్ స్టార్స్) గా పేర్కొనడం జరుగుతోందని, సి, డి గ్రేడ్ విద్యార్థుల(రైజింగ్ స్టార్స్) పై ప్రత్యేక దృష్టి సారించి, వారు మంచి మార్కులు సాధించే విధంగా మోటివేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టీచర్స్ ఎలా చెప్తున్నారు, పిల్లలకు పాఠాలు అర్థమవుతున్నాయా, సబ్జెక్ట్ వారీగా పిల్లల సామర్థ్యాలు ఎలా ఉన్నాయో గమనించాలన్నారు. మార్కులు రాని సబ్జెక్ట్ ల కు సంబంధించి విద్యార్థుల సందేహాలు తీర్చే విధంగా ప్రత్యేకంగా తరగతులను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులకు హోమ్ వర్క్ ఇచ్చి పదే పదే వారితో రాయించాలన్నారు..ప్రతి రోజూ 20 మార్కులకు స్లిప్ టెస్ట్ లను నిర్వహించడం జరుగుతోందని, ఇందులో యావరేజ్ పర్సంటేజ్ 15 శాతానికి మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..14 మండలాలు యావరేజ్ పర్సంటేజ్ లో వెనుకబడి ఉన్నాయని, ఈ మండలాలపై దృష్టి పెట్టాలని డిఇఓ, సమగ్ర శిక్ష ఏపీసీ లను ఆదేశించారు. ఆర్డీవో లు కూడా తమ డివిజన్ లో వెనుకబడిన పాఠశాలల్లో పురోగతి సాధించేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హిందీ సబ్జెక్ట్ కు సంబంధించి ఉపాధ్యాయుల కొరత ఉన్నందున, ఆన్లైన్ తరగతులను నిర్వహించి హిందీ సబ్జెక్ట్ ను బోధిస్తామన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఉత్తీర్ణతా శాతం పెరిగేలా మెంటార్లు కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ జిల్లాలో అక్షరాస్యతా శాతం 57 మాత్రమే ఉన్నందున కొన్ని ప్రాంతాలలో తల్లిదండ్రులకు పిల్లల చదువుపట్ల అంతగా అవగాహన ఉండకపోవచ్చన్నారు.. అందువల్ల ప్రభుత్వం తరఫున అధికారులు బాధ్యత తీసుకొని విద్యార్థుల్లో విద్య పట్ల చైతన్యం కలిగించే పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.సమావేశంలో డి.ఆర్.ఓ వెంకట నారాయణమ్మ, డీఈఓ ఎల్. సుధాకర్, సమగ్ర శిక్ష ఏపీసీ డా.లోకరాజు, కర్నూలు, పత్తికొండ, ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, హౌసింగ్ పిడి చిరంజీవి, ఎస్ డి సి అనురాధ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాలలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించగలరు

**- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**






**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** బాలలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించగలరని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.శుక్రవారం గౌ.ప్రధానమంత్రి వర్యులు నరేంద్ర మోదీ గారు ఢిల్లీ లో నిర్వహించిన వీర్ బాల్ దివస్ -2025 వేడుకల కార్యక్రమంలో కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల ధైర్యాన్ని, త్యాగాన్ని స్మరించుకుంటూ వీర్ బాల్ దివస్ -2025 ను నిర్వహించుకుం టున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా వీర్ బాల్ పురస్కారాలు అందుకున్న వారిలో కర్నూలు జిల్లా మద్దికెర మండలానికి చెందిన పారా అథ్లెట్ H.U. శివాని ఉండడం జిల్లాకు గర్వకారణం అని కలెక్టర్ ప్రశంసించారు.సిక్కుల పదవ గురువు గురు గోవింద్ సింగ్ కుమారులు 9 ఏళ్ల జోరావర్ సింగ్, ఐదేళ్ల ఫతేసింగ్ ల అమర త్యాగాన్ని స్మరించుకుంటూ 2022 నుండి భారత ప్రభుత్వం వీర్ బాల్ దివస్ ను ప్రతి నెల డిసెంబర్ 26న నిర్వహిస్తోందని తెలిపారు. బాలలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేయగలరని, ప్రత్యేకించి జిల్లాలో బాలల కోసం పనిచేసే సంస్థలు, ఎన్జీవోలు, అన్ని శాఖల జిల్లా అధికారులు చొరవ తీసుకొని బాలల అభివృద్ధి కోసం వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి విజయ, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణారెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి జుబేదాబేగం, డిస్ట్రిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్, బాలల అబ్జర్వేషన్ హోమ్స్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతిగృహాల్లో 15 రోజుల్లోపు అవసరమైన మైనర్ రిపేర్‌లను చేయించాలి

**- వసతిగృహాల నిర్వహణ సక్రమంగా లేకపోతే అధికారులు,సిబ్బందిపై చర్యలు తప్పవు**

**- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**





**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** జిల్లాలో ఉన్న అన్ని సంక్షేమ వసతి గృహాల్లో 15 రోజుల్లోపు మైనర్ రిపేర్లను చేయించి, అవసరమైన వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు..శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో కల్పించాల్సిన సౌకర్యాలు, నిర్వహణ పై అన్ని సంక్షేమ శాఖల వార్డెన్లతో, అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని సంక్షేమ వసతిగృహాల్లో టాయిలెట్ లు, ఫ్యాన్లు, లైటింగ్, డోర్ లకు మెష్, ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు లాంటివి ఏవైనా 15 రోజుల్లోపు చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మైనర్ రిపేర్లకు కొంత నిధులు ఇవ్వడం జరిగిందని, వాటితో ఈ మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు.మేజర్ రిపేర్లకు పై నుండి కానీ సీఎస్సార్ నిధులు కానీ తెప్పించి చేయిస్తామని కలెక్టర్ తెలిపారు. హాస్టళ్లలో ముళ్ళ పొదల తొలగింపు, డ్రైనేజ్ పనులు, అవసరమైన చోట వీధి దీపాలు వేయించాలని కలెక్టర్ డిపివో ను ఆదేశించారు. టాయిలెట్స్ కు నీటి కనెక్షన్, సెప్టిక్ ట్యాంక్ కనెక్షన్, సోక్ పిట్స్ పనులు చేయించాలని ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ ఈ ని ఆదేశించారు.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న హాస్టళ్లకు అవసరమైన చోట స్వచ్ఛ భారత్ కింద టాయిలెట్ లను నిర్మించాలని అడిషనల్ కమిషనర్ ను ఆదేశించారు.రెండు రోజుల కిందట కోసిగి మండల కేంద్రంలోని వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహమును తనిఖీ చేశానని, అక్కడ నిర్వహణ సరిగా లేదని, వసతి గృహాల నిర్వహణ సరిగా లేకపోతే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠినమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అక్కడ స్క్రాప్ మెటీరియల్ మొత్తం డిస్పోస్ చేయకుండా అలాగే పెట్టారని, అన్ని సంక్షేమ వసతి గృహాలలో స్క్రాప్ మెటీరియల్ ను డిస్పోస్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.. అదే విధంగా టాయిలెట్ లు, ఫ్లోరింగ్ మొత్తం యాసిడ్ తో క్లీన్ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు.పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే కఠినమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు..కొన్ని వసతి గృహాలలో పిల్లలను పాలు, పెరుగు తీసుకొని రమ్మని బయటికి పంపిస్తున్నారని ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని, ఇలాంటి ఫిర్యాదులు రాకూడదని, వస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్ భవనాలు మంచి స్థితిలో లేకపోతే వెంటనే ఖాళీ చేసి, వేరే భవనంలోకి మార్చాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.. వంట వారు, ఇతర సిబ్బంది సరిగా లేకుంటే వెంటనే తీసి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.. వసతి గృహాల్లో విద్యార్థులకు ట్యూషన్ చెప్పేందుకు మంచివిద్యా వాలంటీర్ లు ఉండాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 10 వ తరగతి లో ఉత్తీర్ణతా శాతం ఎక్కువ రావాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.. కొత్త వసతి గృహాల ఏర్పాటు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు...సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, మైనార్టీ కార్పొరేషన్ అధికారి సబిహా పర్వానా, రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సురేష్, డిపివో భాస్కర్, ఆర్ డబ్బు ఎస్ ఎస్ ఈ మనోహర్, సంక్షేమ వసతి గృహాల వార్డెన్ లు తదితరులు పాల్గొన్నారు..

# పన్ను వసూళ్లపై అశ్రద్ధ వహిస్తే చర్యలు



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 26 :** ఇంటి పన్ను వసూళ్లపై అశ్రద్ధ వహిస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని బండి ఆత్మకూరు మండల విస్తరణాధికారి పురుషోత్తం హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలో ఉన్న పెద్దదేవళా పురం, భోజనం సంత జుటూరు, నారాయణపురం,కాకనూరు గ్రామ సచివాలయాలను డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం సందర్శించారు. డిసెంబరు ఆఖరు నాటికి ఇంటి పన్ను వసూళ్లను 50 శాతం మేరకు వసూలు చేయాలని లేని పక్షంలో సంబంధిత కార్యదర్శులు జిల్లా పంచాయతీ అధికారికి సంజాయిషి ఇచ్చుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలలో ఇప్పటికే 25 శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యాయని, వసూళ్లను మరింత వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని కార్యకర్తలకు సూచించారు. సెకండ్ ఫేస్ స్వామిత్వపు సెకండ్ ఫేస్ స్వామిత్వకు సంబంధించి 9(2) నోటీసులను గృహ యజమానులకు పంపిణీ చేయాలని సూచించారు. నోటీసులు ఇచ్చిన 21 రోజుల లోపల ఏదైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత విచారణ అధికారికి ఫిర్యాదు చేసుకోవచ్చని డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం పేర్కొన్నారు. సంత జూటూరు గ్రామంలో స్వామిత్వ కింద నోటీసులను పంపిణీ చేసే విధానాన్ని ఆయన పరిశీలించారు.

# ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో:** నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం నంద్యాల ఎంపీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సీనియర్ న్యాయవాది బి. శంకరయ్య నాయకత్వంలో నూనెపల్లె ప్రాంత సమస్యలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దృష్టికి తెచ్చారు. నూనెపల్లి వద్ద రైల్వే అండర్ పాస్ వంతెన ఏర్పాటు చేయాలని కోరగా రైల్వే శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో బాధితులు వ్యక్తిగతంగా, గ్రామాల్లోని సామూహిక సమస్యలు ఎంపీ దృష్టికి తీసుకురాగా వెంటనే ఫోన్ ద్వారా ఆయా శాఖల అధికారులకు సమస్య వివరించి కొన్ని పరిష్కారం చేశారు. కొందరు మహిళలు, వికలాంగులు, వృద్ధులు తమ సమస్యలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి విన్నవించుకోగా కొన్ని వెంటనే పరిష్కారం చూపి, మరి కొన్ని వినతి పత్రాలు ఆయా శాఖ అధికారులకు పంపారు. మీకు అందుబాటులో ఉంటూ మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్థానని నంద్యాల ఎంపీ ఆఫీసుకు వచ్చిన అర్జీ దారులకు ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, జోనల్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ మెంబర్ ఎ. వెంకటరంగయ్య, బి ఎస్ ఎన్ ఎల్ సలహా కమిటీ సభ్యులు చిట్టిబోయిన శ్రీనివాసయాదవ్, పెరుమాళ్ళ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూముల నేరంపై కొలతలు

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 26 :**

అటవీ భూముల త్రవ్వకాల విషయంలో జరిగిన నేరంపై సంబంధిత అధికారులు కొలతలు నిర్వహించినట్లుగా తెలిసింది. మూడు రోజుల క్రితం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్ణ పాడు పరిసర ప్రాంతాలలో అటవీ భూములకు సంబంధించిన మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్న విషయం విదితమే. ఈ విషయంలో మట్టిని త్రవుతున్న ఒక ప్రోక్లైనర్ను అటవీ అధికారులు స్వాధీనం చేసుకొని ఓంకారం బేస్ కు తరలించడం జరిగింది. అదే ప్రాంతంలో మరో ప్రోక్లైనరును మట్టి మాఫియా దారులు వదిలేసి పారిపోయారు. ప్రోక్లైనర్ కోసం మాఫియా దారులు వస్తారని అటవీ సిబ్బంది రెండు రోజులుగా ఆ ప్రాంతంలో నిఘా వేయడం జరిగింది. శుక్రవారం సాయంత్రం నాటికి కూడా ప్రోక్లైనర్ సంబంధికులు ఎవరు రాకపోవడంతో ప్రోక్లైనర్ను గాజులపల్లె డిపోకు తరలించాలని అటవీ అధికారులు నిర్ణయించుకున్నట్లుగా సమాచారం. ఈ కేసుకు సంబంధించి అధికారులు కొలతలు నిర్వహించినట్లుగా తెలుస్తోంది. అటవీ భూముల్లో మట్టిని ఏ మేరకు త్రవ్వారు? ఎంత మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించారు అన్న విషయంపై అధికారులు పరిశీలించి కొలతలు నిర్వహించార ని తెలుస్తోంది. కొలతల నివేదికను నంద్యాల డివిజనల్ ఫారెస్ట్ అధికారికి పంపే అవకాశం ఉంది. విషయంలో మట్టి మాఫియా దార్లకు ఎంత మేరకు రాయల్టీ విధించాలి అన్న విషయంపై ఆయన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేరం జరిగిన తర్వాత అటవీ భూముల రక్షణ విషయంలో అధికారులు మరింత కఠినంగా వ్యవహరించే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. అటవీ అధికారులు అనుమతులు లేకుండా సామాన్య మానవులు సైతం అటవీ ప్రాంతంలో ప్రవేశిస్తే అటవీ చట్టపరంగా చర్యలు తీసుకునే విధంగా చట్టాలను ఏర్పాటు చేశారు. మూడు రోజుల క్రితం భూముల త్రవ్వకాల విషయంలో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని అటవీ శాఖకు చెందిన అధికారులు కఠిన తరంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.

# నూతన బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని వినతి



**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 26 :** మండల పరిధిలోని మడ్డి లింగదహళ్లి గ్రామ శివారులో ప్రధాన రహదారి బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠ జ్యోతి కి మడ్డి లింగదహళ్లి గ్రామ సర్పంచ్ సుధాకర్ వినతిపత్రం అందజేశారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ మడ్డి లింగదహళ్లి, పెద్ద గోనెహళ్, హెబ్బటం, ఇంగాళదాహల్, ఈ గ్రామాల ప్రధాన సమస్య అయిన మడ్డి లింగదాహళ్లి గ్రామం నుండి ఇంగలదాహల్ ఆర్ అండ్ బి రోడ్ నందు శితిలావాస్తకు చేరిన బ్రిడ్జి ను కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేయాలని అన్నారు. వర్షాకాలం లో ఉన్న బ్రిడ్జిపై వంక ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి, టిడిపి యువ నాయకుడు కురువ నాగరాజు,ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

# ఇటిక్యాల గ్రామంలో ప్రజా సమస్యలపై యువ నాయకుడు శివ ప్రసాద్ రెడ్డి ఆకస్మిక పర్యటన

## – నీటి సరఫరా, వీధిలైట్లు, మౌలిక వసతులపై ప్రజలతో నేరుగా చర్చ



**కొలిమిగుండ్ల విలేఖరి (పల్లె వెలుగు న్యూస్) :** కొలిమిగుండ్ల మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన యువ నాయకుడు శివ ప్రసాద్ రెడ్డి ఈరోజు గ్రామంలో పర్యటిస్తూ ప్రజలసమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీల్లో తిరుగుతూ తాగునీటి సరఫరా, వీధిలైట్ల పరిస్థితి, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతులపై స్థానికులను అడిగి వివరాలు సేకరించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విన్న శివ ప్రసాద్ రెడ్డి, ప్రజల అవసరాలకు అనుగుణంగా తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వీధిలైట్లు సరిగా పనిచేయక ఇబ్బందులు పడుతున్నామని, కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులుఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధే నా లక్ష్యం. ప్రజల సమస్యలను కేవలం విని వదిలేయకుండా, ప్రతి సమస్యపై పోరాడి పరిష్కారం తీసుకువచ్చే బాధ్యత నా మీదే అని స్పష్టం చేశారు. యువ నాయకుడు స్వయంగా గ్రామంలో తిరిగి ప్రజలతో నేరుగా మాట్లాడటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి నాయకత్వం వల్లే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

# కమ్యూనిటీ లెట్రిన్ ఏర్పాటు చేయాలి





**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 26 :** హొళగుంద లోని దిడ్డీ కాలనీకి చెందిన మహిళలకు కమిటీ లెట్రిన్ ఏర్పాటు చేయాలని టిడిపి మండల కన్వీనర్ తిప్పయ్య , దిడ్డి కాలనీ మహిళలు ఆలూరు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వైకుంఠ జ్యోతిని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటింటికి మరుగుదొడ్డి పేరుతో బహిరంగ మలవిసర్జన ఉండకూడదని వ్యక్తిగత మరుగు దొడ్లు మంజూరు చేసింది. వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయడంతో కాలనీలో ఉన్నటువంటి ఓపెన్ లెట్రిన్ ను అధికారులు కూల్చివేసినారు. అయితే ఇరుకైన సందులలో తక్కువ స్థలంలో ప్రజలు ఇల్లునిర్మించుకుని ఉండడంతో చాలామందికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోలేక పోయినారు. ఇదే విషయాన్ని అప్పట్లో అధికారులకు, శాసనసభ్యులు దృష్టికి తీసుకొని పోవడంతో బహిరంగ మలవిసర్జన నిషేధం ఉందని అందువల్ల ఓపెన్ లెట్రిన్ స్థానంలో సులభ్ కాంప్లెక్స్ తరహాలో కమ్యూనిటీ లెట్రిన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ విషయం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మహిళలు బహిర్భూమికి పోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఈ స్థలం ఓపెన్ ప్లేస్ గా ఉంది. ఈ స్థలము ఓపెన్ ప్లేస్ లో ఉండడంతో అధికారులు ఆ స్థలంలో విలేజ్ క్లినిక్ కడతామని ప్రతిపాదనలు పెట్టారు. ఆ స్థలం కమ్యూనిటీ లెట్రిన్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యను తీర్చాలని కోరారు.

# ఆర్టీసీ బస్టాండ్‌లో రూ.9 లక్షలతో నిర్మించిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



**– జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**
**– పార్లమెంట్ నిధులతో ఆర్టీసీ ప్రయాణికులు, కార్మికులకు ఉచిత శుద్ధి నీరు.**
**– నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి.**



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో :** నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు పార్లమెంట్ నిధులతో నిర్మించిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డా. బైరెడ్డి శబరితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. రూ.9 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా ఆర్టీసీ ప్రయాణికులు, కార్మికులకు శుద్ధి చేసిన మంచినీరు ఉచితంగా అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, నంద్యాల జిల్లా బస్ కాంప్లెక్స్‌లో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎంపీ ల్యాండ్స్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ బస్టాండ్ నుంచి ప్రతిరోజూ సుమారు 22 వేల మందికి పైగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఎంపీ డా. బైరెడ్డి శబరి ఎప్పుడూ అభివృద్ధి ప్రతిపాదనలు సమర్పిస్తున్నారని ప్రశంసించారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో పెయింటింగ్, డ్రైనేజీ మరమ్మత్తులు, టాయిలెట్ల పునరుద్ధరణ, సరైన పార్కింగ్ సదుపాయాల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. కాంప్లెక్స్‌లోని దుకాణదారులు ఎంఆర్పీ ధరకే వస్తువులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒక నెల వ్యవధిలో బస్టాండ్ రూపురేఖలు మారేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇందుకు ప్రజల సహకారం అవసరమని కోరారు. ఈ సందర్భంగా నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి మాట్లాడుతూ, శుద్ధి చేసిన మంచినీటితో సుమారు 60 శాతం రోగాలను నివారించవచ్చని పేర్కొన్నారు. కలుషిత నీరే అనేక వ్యాధులకు కారణమని, అందువల్ల ప్రజలకు శుద్ధి చేసిన నీరు అందించడమే లక్ష్యంగా ఎంపీ నిధులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలో అవసరం ఉన్న ప్రతి గ్రామంలో ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఉచితంగా శుద్ధి చేసిన నీరు అందించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఎక్కువ ధర చెల్లించి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వస్తున్న పరిస్థితిని గమనించి, ప్రయాణికులు మరియు ఆర్టీసీ కార్మికుల అభ్యర్థన మేరకు రూ.9 లక్షల ఎంపీ నిధులతో నూతన మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించి ఉచితంగా నీరు అందించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, పారిశుధ్య కార్మికులు తమ సమస్యలపై ఎంపీ డా. బైరెడ్డి శబరికి వినతి పత్రాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి, ఆర్టీసీ డిపిటీసి రజియా సుల్తానా, ఆర్టీసీ డిపో మేనేజర్ జె.వి. మాధవిలత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఆర్‌ఈఓ ఈ. శ్రీనివాసులు, డీఈఈ శివమోహన్, ట్రాఫిక్ సీఐ చాన్ బాషా, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, మినరల్ వాటర్ ప్లాంట్ కాంట్రాక్టర్ జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కర్నూలు జిల్లాలోనే ఏర్పాటు చేయాలి

## – బొజ్జా దశరథరామిరెడ్డి



**పల్లె వెలుగు నంద్యాల రూరల్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు దక్కాల్సిన జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ని కోరడాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి స్వాగతిస్తోందని, సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని జూపాడు బంగ్లా ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన సుమారు 1,800 ఎకరాల విస్తారమైన భూమి అందుబాటులో ఉందని, అలాగే కేసీ కెనాల్, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటి వసతి కల్పించే పూర్తి అవకాశం ఉన్న ఈ ప్రాంతంలోనే ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి గతంలోనే ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనేక రకాల పంటలు, ఉద్యానవన పంటలు పండే రాయలసీమ ప్రాంతంలో వ్యవసాయ విద్యా, పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నప్పటికీ, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయకుండా కేవలం 100 ఎకరాల భూమి మాత్రమే ఉన్న గుంటూరు జిల్లా "లాం" ఫార్మ్‌కు తరలించిన విషయాన్ని కూడా ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అనేక కార్యక్రమాలు నిర్వహించి, ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞాపన పత్రాలు అందించిన విషయాన్ని కూడా బొజ్జా గుర్తు చేశారు. జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడితే, దానికి అనుబంధంగా వ్యవసాయ కళాశాలలు, పరిశోధనా కేంద్రాలు ఏర్పడి రాయలసీమ వ్యవసాయ రంగానికి దిశానిర్దేశం చేసే కేంద్రంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందని బొజ్జా వివరించారు. ఏదేమైనా, ఇప్పటికైనా ముఖ్యమంత్రి జాతీయ స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం అంశాన్ని కేంద్రం ముందు ఉంచిన నేపథ్యంలో, ఈ విశ్వవిద్యాలయాన్ని తప్పనిసరిగా రాయలసీమలో, ముఖ్యంగా జూపాడు బంగ్లా ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నామని బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. అదేవిధంగా, రాయలసీమ ప్రాంతానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి, జూపాడు బంగ్లా వద్దే ఈ జాతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బాధ్యత తమదేనని గుర్తించాలి అని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి, చెరుకూరి వెంకటేశ్వరనాయుడు, న్యాయవాది అసదుల్లా, భాస్కర్ రెడ్డి, జానోజాగో మహబూబ్ భాష, కొమ్మా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# భారత గడ్డపై సిపిఐ 100 సంవత్సరములు పూర్తి చేసుకొని 101వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సిపిఐ.

## – నంద్యాల సిపిఐ కార్యాలయంలో పతాకవిష్కరణ గావించిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు




**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 101 వ ఆవిర్భవ దినోత్సవ కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ అధ్యక్షత వహించడం జరిగింది .ఈ పతాకవిష్కరణ కార్యక్రమానికి నాయకులు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ జిల్లా నాయకులు మురళీధర్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాముడు భాస్కర్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు భూమని శ్రీనివాసులు , లక్ష్మీదేవి ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు సిపిఐ పట్టణ నాయకుడు ధనుంజయ్ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు హరినాథ్ హాజరైనారు.అనంతరం పతావిష్కరణ గావించిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ భూమి కోసం ముక్తి కోసం పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించిన ఏకైక పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101 వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం జరిగిందని అన్నారు . దేశంలో నాటి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ కంటే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సిపిఐ పార్లమెంట్ సభ్యులు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ రావి నారాయణరెడ్డి చేతుల మీదుగా పార్లమెంట్ భవనం ప్రారంభించిన ఘనత కమ్యూనిస్టు పార్టీకే దక్కిందని అన్నారు .దేశంలో రాష్ట్రంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు సాధనలో పోరాటాలు చేసి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడిన పార్టీ సిపిఐ అని అన్నారు .వెట్టిచాకిరి విముక్తికై నిరంకుశ నైజాం నవాబును గద్దె దించడానికి మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో మూడు వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ ది అని అన్నారు . అటువంటి మహోత్తరమైన ఘన చరిత్ర కలిగిన సిపిఐ పతావిష్కరణ గావించడం అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు .ఈ కార్యక్రమంలో పట్టణ సిపిఐ శాఖ కార్యదర్శులు సహాయ కార్యదర్శులు మహిళా సమాఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# రూ.5.33 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభం

**మంత్రులు ఎన్.ఎం.డి. ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**







**పల్లె వెలుగు గోస్పాడు :** నంద్యాల నియోజకవర్గం, గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలో రూ.5.33 కోట్ల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రాష్ట్ర రోడ్లు & భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డా. బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నాబార్డ్ నిధులు రూ.5.33 కోట్లతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఒక్క నంద్యాల జిల్లాలోనే రూ.150 నుంచి రూ.160 కోట్ల వ్యయంతో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆసు పత్రుల్లో అందిస్తున్న వైద్య సదుపా యాలను ప్రజలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతుందనే భ్రమలో ప్రజలు ఉండవద్దని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ నేడు అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, నిపుణులైన వైద్యులతో నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని మంత్రులు పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఆసుపత్రులకు శంకుస్థాపనలు చేసి, నిర్మాణాలపై గొప్పలు చెప్పుకున్నప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమయ్యారని తెలిపారు. యాళ్లూరు గ్రామంలో ఆసుపత్రి నిర్మాణానికి స్థలం అందించిన దాతలకు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలకు కేంద్రంగా ఉన్న యాళ్లూరులో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గతంలో అత్యవసర వైద్య సేవల కోసం నంద్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ అవసరం తగ్గుతుందని అన్నారు. నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని మంత్రులు స్పష్టం చేశారు. ప్రజలు ఆహార నియమాలతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, రూ.5.33 కోట్లతో అధునాతన వైద్య పరికరాలతో కూడిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యాధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మదర్ అండ్ చైల్డ్ సర్వీసెస్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెంటల్ సర్వీసెస్, ఫిజియోథెరపీ తదితర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), 19 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీలు), 11 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 2 ఏరియా ఆసుపత్రులు ప్రజలకు సేవలందిస్తున్నాయని వివరించారు. ఆధునిక జీవనశైలి కారణంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ సామర్థ్యం పెంపు అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ లలిత, హెచ్‌డీఎస్‌సీ సభ్యుడు వెంకట్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డా. శ్రీరామ్ కుమార్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు జాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు ఎన్టీఆర్

### – మంత్రులు ఎన్ఎండి. ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి







**పల్లె వెలుగు యాళ్ళూరు :** "తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన యుగపురుషుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు " అని రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి. ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా గోస్పాడు మండలం యాళ్ళూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని వారు ముఖ్యఅతిథిలుగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఎన్టీఆర్ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, ఆయన ఒక వ్యవస్థ. రెండు రూపాయలకే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా గృహాల వంటి విప్లవాత్మక పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన అపర దానకర్ణుడని. సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్ళు అని నమ్మి పరిపాలన సాగించిన ధీరశాలి అని కొనియాడారు. నాలాంటి సామాన్యులు ఈరోజు ఈ స్థాయిలో ఉన్నారంటే అది ఎన్టీఆర్ గారు పెట్టిన రాజకీయ భిక్షే అని. వెనుకబడిన వర్గాలకు, మైనారిటీలకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించి, అధికారం అంటే కేవలం కొందరి సొత్తు కాదని ఆయన నిరూపించారని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , యువనేత లోకేష్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం చూస్తుంటే ఆయన పట్ల ప్రజలకున్న చెరగని ముద్ర అర్థమవుతోందని అన్నారు. ఈ విగ్రహం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు . గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ, సంక్షేమం మరియు అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడటమే మా లక్ష్యం అని తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

### – మంత్రి ఎన్ఎండి ఫరూక్






**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువురు తమ సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రి ఫరూక్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆయన తక్షణమే ఆయా సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం తరఫున, తెలుగుదేశం పార్టీ తరఫున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## నేడే హిందూ సమ్మేళనం

### – పెద్ద ఎత్తున కదలి రానున్న వానరసైన్యం




**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 26 :** హొళగుంద లోని శ్రీ సిద్దేశ్వర దేవాలయ ప్రాంగణంలో నేడు జరుగునున్న హిందూ సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ హిందూ సంబరాణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వానరసేనముల హిందువులు తరలి రానున్నట్లు వారు తెలిపారు.రాష్ట్రీయ స్వయంసేవకు సంఘం అనేక సంవత్సరాల నుంచి నిరంతరం శ్రమిస్తూ హిందూ సమాజాన్ని జాగృతం చేస్తూ, ప్రతి ఒక్కరిలోను జాతీయ భావాలను నిర్మాణము చేస్తూ నేడు 100వ సంవత్సరములో అడుగుపెడుతున్న సందర్భముగా హిందూ సమ్మేళనాన్ని నిర్వహించాలని "హిందూ సమ్మేళన నిర్వాహణ సమితి" తలపెట్టింది. ప్రతి హిందువులలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం కోసం నిర్వహించనున్న ఈ సమ్మేళనం మన గ్రామాలలో మరియు బస్తీలలో హిందుత్వ వాతావరణం నిర్మాణం చేయడం, మత మార్పిడిలకు అడ్డుకట్ట వేయడం, మన మంతా హిందువులం, కులం మన ఇంటి వరకే పరిమితం–గడప దాటితే మన మంతా హిందూవులం అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు శ్రీ జగద్గురు శ్రీమరి కొట్టూరు దేశకరు స్వామి, శ్రీ ఎం. బాల చంద్ర, మహిళ అతిథి శ్రీ హారిక మంజునాథ్ ధార్మిక ఉపన్యాసం, శ్రీ సురేంద్ర విభాగ ప్రచారక్ హాజరుకానున్నట్లు హిందూ సమ్మేళన నిర్వాహణ సమితి సభ్యులు తెలిపారు. హిందూ సమ్మేళనా కార్యక్రమానికి హాజరుకానున్న వారికి భోజన వసతి కల్పించినట్లు హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు తెలిపారు.

## ఎరువులు అధిక రేట్లకు అమ్మితే చర్యలు





**మహానంది, పల్లె వెలుగు :** ఎరువులు, పురుగు మందుల దుకాణాల యజమానుదారులు నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి బి. నాగేశ్వర రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏవో మాట్లాడుతూ.. యూరియా నిలువల సమాచారానికి సంబంధించిన ఫ్లెక్సీ బోర్డులను దుకాణం ముందు ప్రతిరోజు ఉంచాలని డీలర్లను హెచ్చరించారు.స్టాక్ బోర్డులో యూరియా, ఇతర ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు పొందుపరిచి, రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు.ఎరువుల అమ్మకపు వివరాలను ఎప్పటికప్పుడు ఈపాస్ మిషన్ లో అప్డేట్ చేయాలని తెలిపారు.అనుమతులు ఉన్న ఎరువులు, పురుగు మందులను మాత్రమే అమ్మాలని ఆదేశించారు.

## మహానందీశ్వరుని హుండీ ఆదాయం రూ.82.49 లక్షలు



**మహానంది, పల్లె వెలుగు :** మహానంది పుణ్యక్షేత్రంలో 73 రోజులకు గానూ భక్తులు సమర్పించిన హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. దేవస్థానానికి మొత్తం రూ.82,49,083 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో ఎన్ .శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందులో ప్రధాన ఆలయాల ద్వారా రూ.81,51,458, అన్నప్రసాదం హుండీ ద్వారా రూ.67,080, గోసంరక్షణకి రూ.30,545 లభించినట్లు ఆయన పేర్కొన్నారు.బంగారం 0–003.750 గ్రాములు,వెండి 0–340–000 గ్రాములు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఎస్ .మోహన్, ఆలయ ఏఈవో మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య, నీలకంతేశ్వర రాజు, దేవస్థానం సిబ్బంది, సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 31న పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలి

## – డీఆర్డీఏ –వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.బి. శ్రీధర్ రెడ్డి

**పల్లె వెలుగు నంద్యాల :** జనవరి 2026 నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ మొత్తాన్ని ఈ నెల 30వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం డబ్ల్యూ ఈ ఎ /డబ్ల్యూ డి ఎస్ / పి ఎస్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు డీఆర్డీఏ – వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.బి. శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో పెన్షన్ పంపిణీ బాధ్యత కలిగిన అధికారులు, సిబ్బంది ఎన్టీఆర్ భరోసా పెన్షన్ యాప్ ద్వారా నగదు విత్‌డ్రా చేసుకొని, వెంటనే యాప్‌లో తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని ఆయన సూచించారు. డిసెంబర్ 31వ తేదీ ఉదయం నుంచే పెన్షన్ దారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ల పంపిణీ ప్రారంభించి, అదే రోజున 100 శాతం పంపిణీ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవైనా కారణాల వల్ల డిసెంబర్ 31న మిగిలిపోయిన పెన్షన్ దారులకు జనవరి 2వ తేదీన తప్పనిసరిగా పెన్షన్లు పంపిణీ చేసి, శాతం వందకు వంద పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నంద్యాల జిల్లాలో మొత్తం 2,13,630 మంది పెన్షన్ దారులకు దాదాపు రూ.92.41 కోట్ల మేర పెన్షన్ మొత్తం పంపిణీ చేయనున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలిపారు. పెన్షన్ పంపిణీలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. పెన్షన్ పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, సమయానికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆ ప్రకటనలో తెలిపారు.

# కర్నూలులో ఓపెన్ డ్రింకింగ్‌పై కఠిన చర్యలు: 17,089 కేసులు నమోదు!





**పల్లె వెలుగు కుర్నూల్ బ్యూరో :** కర్నూలు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్, ఐపిఎస్ శుక్రవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు అసౌకర్యం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశించారు. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా ఓపెన్ డ్రింకింగ్‌పై 17,089 కేసులు నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు.బహిరంగంగా మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, రోడ్లు, నడకదారులు, పార్కులు, వ్యాపార దుకాణాల సమీపాలు, శివారు ప్రాంతాలు మరియు వల్నరబుల్ ఏరియాల్లో ప్రజా జీవనానికి ఆటంకం కలిగించే వారిపై పబ్లిక్ న్యూసెన్స్ కింద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా శాంతి భంగం కలిగించే ఈ ఓపెన్ డ్రింకింగ్‌ను పూర్తిగా అరికట్టాలని పోలీసులు, పరిశీలకులు భాగస్వామ్యం అవ్వాలని కోరారు.

**కీలక అంశాలు**

కేసులు: 2025 జనవరి–డిసెంబర్ 20 వరకు 17,089
లక్ష్య ప్రాంతాలు: రోడ్లు, పార్కులు, దుకాణాలు, శివారులు
చట్టం: పబ్లిక్ న్యూసెన్స్ చట్టం ప్రకారం చర్యలు
బాధ్యత: అన్ని పోలీస్ స్టేషన్లు, పరిశీలకులు

ఈ చర్యలతో ప్రజా భద్రత, శాంతి నిలబెట్టడమే లక్ష్యమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్పష్టం చేశారు. జిల్లా పోలీసులు ఈ దిశగా విస్తృతమైన పర్యటనలు, అవగాహన కార్యక్రమాలు చేపడతారు.

# సౌత్ జోన్ ఆక్వాటిక్ చాంపియన్షిప్‌కు కర్నూలు స్విమ్మర్స్



**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :** హైదరాబాద్ గచ్చిబౌలి స్విమ్మింగ్ పూల్ కాంప్లెక్స్ లో ఈ నెల 27 నుంచి 29 వ తేది వరకు నిర్వహించనున్న 36 వ సౌత్ జోన్ ఆక్వాటిక్ చాంపియన్షిప్ లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి కర్నూలు జిల్లా ఈత క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈమేరకు ప్రాతినిధ్యం వహించనున్న గ్రూప్ 1 బాలుర విభాగం ఈత పోటీల్లో వై. దేవ్ శృత్ సాయి, పి.హేమలత, వాటర్ పోలో పోటీల్లో కె. శృతి, బి.శిరి చేతన రాజ్, పి. లహరి, సి. భవేశ్వర్ నాథ్ రెడ్డి, ఎం. హేమచంద్ర లను డీ ఎస్ డీ వో భూపతి రావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్, కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ సెక్రెటరీ రామకృష్ణ యాదవ్ అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి దస్తగిరి, జాయింట్ సెక్రెటరీలు రామకృష్ణ, శివరాజ్ , ఆర్గనైజింగ్ సెక్రెటరీలు హజరథయ్య, శివ ప్రసాద్, సభ్యులు వెంకటేష్, విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



- కూటమి నాయకులు సమిష్టిగా ముందుకు సాగాలి
- వేసవి దృష్ట త్రాగునీరు సమస్య రాకూడదు
- ఆలూరు జనసేన పార్టీ ఇంచార్జ్ వెంకప్ప



**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 26 :** కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఆలూరు జనసేన పార్టీ ఇంచార్జ్ వెంకప్ప అన్నారు.హొళగుందలో ఆలూరు జనసేన పార్టీ ఇంచార్జ్ వెంకప్ప శుక్రవారం పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. మూడు పార్టీల నేతల మధ్యా సయోధ్య చక్కగా కుదిరింది. చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అన్ని నిర్ణయాలలోనూ సమష్టిగా ముందుకు సాగుతోంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతల మధ్య సయోధ్యం కుదిరింది. పాలన సజావుగా సాగుతోంది. ఆలూరు నియోజకవర్గంలో ఆయా పార్టీల శ్రేణులు కార్యకర్తల మధ్య మాత్రం ఆటువంటి సయోధ్య కనిపించడం లేదని ఆలూరు జనసేన పార్టీ ఇంచార్జ్ వెంకప్ప అన్నారు. నాయకులు సమావేశం ఏర్పాటు చేసి, నాయకులతో ఈ విషయంపై చర్చించారు. ఇదేవిధంగా కొనసాగితే ఆలూరు గడ్డపై కూటమి ప్రభుత్వం బలహీన పడుతుందని, దీని దృష్టిలో ఉంచుకొని మూడు పార్టీల నేతల మధ్య సయోధ్య చక్కగా కుదిరించుకొని పోవాలి. ఇలా చేస్తే కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలో బలపడుతుందని తెలిపారు. ఆరకూటమియాసంతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు విద్యార్థులకు సందేశం ఇచ్చారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని త్రాగునీరు ప్రజలకు సజావుగా అందాలని అధికారులకు, నాయకులకు తెలిపారు. మండల సమస్యలు ఏమైనా ఉంటే జనసేన ఇన్చార్జ్ వెంకప్ప దృష్టికి తీసుకొస్తే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తారని వారు అన్నారు. మండలానికి విచ్చేసిన ఇంచార్జ్ ను టీడీపీ మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, టీడీపీ మండల ప్రదాన కార్యదర్శి ఈడగ గోవింద్ గౌడ్, జనసేన మండల కన్వినర్ అశోక్, కార్యదర్శి తోట చిన్న ఘన స్వాగతం పలికారు. వీరితోపాటు బిజెపి రాష్ట్ర కౌన్సిలింగ్ నెంబర్ చిదానంద, హొలగుంద సింగల్ విండో డైరెక్టర్ ప్రసాద్, మైనారిటీ మండల అధ్యక్షుడు ముల్లా మోయిన్, టీడీపీ మండల కోకన్వినర్ కె జాకీర్,తోకా వెంకటేష్, హుస్సేన్ పీరా, రామాంజి, గోవిందు, తదితరులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్ బస్సును ఢీ కొట్టిన కారు

## – నలుగురు మృతి ఇద్దరికీ తీవ్ర గాయాలు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు



**ఆళ్లగడ్డ ప్రతినిధి డిసెంబర్ 26 పల్లె వెలుగు :** ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల.. బత్తులూరు మధ్య ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో నలుగురు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలు కావడంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. మృతులు హైదరాబాద్ నిజాంపేటకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల మేరకు తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న టొయోటా క్వాలిస్ (%ూ్రా09 ాూం% 0667) నల్లగట్ల సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న సిజిఆర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న గుండెరావు కులకర్ణి (46), శ్రావణ్ (21), ఇటికాడి నరసింహులు (30), సిద్ధప్ప (50) అక్కడక్కడే మృతిచెందగా శివ సాయి కులకర్ణి,, సిద్ధార్థ కులకర్ణి తీవ్రంగా గాయపడటంతో పోలీసులు నంద్యాల ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ నిజాం కాలేజీలో గుండేరావు కుమారులు సిద్ధార్థ, శివ సాయి చదువుతున్నారు. సిజిఆర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుంచి పుదుచ్చేరి కు వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. కాగా బస్సులోని ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. వారిని వేరే బస్సులో వారి గమ్య స్థానాలకు తరలించారు. కాగా వేగంతో బస్సును ఢీకొట్టడంతో టొయోటా క్వాలిస్ నుజ్జునుజ్జయింది. తిరుపతిలో క్యాటరింగ్ కోసం వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా సంఘటన విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ బి వి రమణ, ఎస్సై వరప్రసాద్, పోలీస్ సిబ్బంది తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కున్న మృతదేహాలను బయటకు తీశారు.108 అంబులెన్స్ సాయంతో గాయపడిన వారిని నంద్యాల



ఆసుపత్రికి తరలించారు. ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# కర్నూలు మెడికల్ కాలేజీలో రూ. 50 కోట్లతో 'నాలెడ్జ్ సెంటర్'

## – పూర్వ విద్యార్థుల వితరణ.. కాలేజీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రి టి.జి. భరత్







**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :** కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సహకారంతో రూ. 50 కోట్ల వ్యయంతో అత్యాధునిక 'నాలెడ్జ్ సెంటర్'ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ వెల్లడించారు. శుక్రవారం మెడికల్ కాలేజీలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

**నాలెడ్జ్ సెంటర్ విశేషాలు:**

విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ కళాశాల రుణం తీర్చుకునేందుకు ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారని మంత్రి తెలిపారు. 66.66 సెంట్ల స్థలంలో ఏడాదిలోగా దీన్ని పూర్తి చేస్తామన్నారు. ఇందులో అడ్వాన్స్‌డ్ లైబ్రరీ, రీసెర్చ్ సెంటర్, జిమ్, ఇండోర్ గేమ్స్ కాంప్లెక్స్, మీటింగ్ హాల్ వంటి సదుపాయాలు ఉంటాయన్నారు. ఈ ప్రతిపాదనకు కళాశాల సిబ్బంది ముక్తకంఠంతో ఆమోదం తెలిపారు.

**ఆసుపత్రి సమస్యలపై చర్చ:**

- ట్రామా కేర్ సెంటర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ. 500 కోట్లతో నిర్మించే అత్యాధునిక ట్రామా కేర్ సెంటర్ కర్నూలుకు వచ్చేలా నివేదికలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.
- మౌలిక సదుపాయాలు: ప్రాంతీయ కంటి ఆసుపత్రి డ్రైనేజీ సమస్యలు, ఐపిఎం బిల్డింగ్ పూర్తి చేయడం, మార్చురీ వద్ద షెడ్లు, ఫ్రీజర్ బాక్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.
- సదుపాయాలు: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ద్వారా రూ. 14.16 కోట్లతో రోగుల సహాయకుల కోసం 150 బెడ్ల బస భవన నిర్మాణం జరుగుతోందని వివరించారు.
- వైద్య పరికరాలు: ఎన్టీఆర్ వైద్య సేవలో పేదలకు ఉచిత ఇంప్లాంట్స్, క్యాన్సర్ డిటెక్షన్ ఎక్విప్‌మెంట్ తదితర పరికరాల ఏర్పాటుపై ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు.

ఈ సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ సాయి సుధీర్, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ రెడ్డి మరియు వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## బిల్డింగ్స్ యాక్ట్ ప్రకారం భవన నిర్మాణ కార్మికులందరూ

# తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**- బాల కార్మికుల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి**

**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**






**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో :** బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యాక్ట్ ప్రకారం పది మందికి మించి కార్మికులు పనిచేస్తున్న ప్రతి భవన నిర్మాణ పనిస్థలంలో పనిచేసే కార్మికులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం-1996, సెస్ నియమాలు-1998పై జిల్లా స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ బషీరున్నిసా బేగం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, బిల్డింగ్ యాక్ట్ చట్టం ప్రకారం పది మందికి మించి కార్మికులు పనిచేసే ప్రతి నిర్మాణ పనిస్థలాన్ని తప్పనిసరిగా 'మీ సేవ' ద్వారా నమోదు చేయించాలని ఆదేశించారు. భవన నిర్మాణ సెస్ వసూలు విషయంలో ప్రతి నెల 10వ తేదీ లోగా సెస్ జమ అయ్యేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. జనవరి 1 నుంచి నవంబర్ వరకు ఇప్పటివరకు పబ్లిక్ నిర్మాణాల నుంచి రూ.9,21,72,426/- మరియు ప్రైవేట్ నిర్మాణాల నుంచి రూ.1,96,77,308/- సెస్ వసూలు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా 20 మందికి మించి కార్మికులు పనిచేస్తున్న ప్రతి సంస్థలో కార్మికులందరూ ఈపీఎఫ్ఓ (ఈ ఈ ఎఫ్ ఓ)లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఇది అత్యంత అవసరమని పేర్కొన్నారు. బాల కార్మికుల చట్టంపై మాట్లాడుతూ, హానికరం కాని కర్మాగారాల్లో 14 సంవత్సరాల లోపు, ప్రమాదకరమైన కర్మాగారాల్లో 18 సంవత్సరాల లోపు బాల కార్మికులు పనిచేయకుండా కఠినంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్కడైనా బాల కార్మికులు ఉన్నట్లు గుర్తించిన పక్షంలో టోల్ ఫ్రీ నంబర్ 1098కు సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్మికుల చట్టాల ప్రకారం కార్మికులకు కనీస వేతనం, భద్రతా ప్రమాణాలు, సంక్షేమ సౌకర్యాలు తప్పనిసరిగా అందేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిటిఓ లక్ష్మీదేవి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ఆ ఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, కార్మిక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశంలో కార్యకర్తలకు గుర్తింపేది?

**- 1983 నుంచి పనిచేస్తున్నాం న్యాయం లేదు**

**- రాజంపేట ఇన్‌చార్జి పై తీవ్ర ఆగ్రహం మోదుగుల**



**ఒంటిమిట్ట పల్లె వెలుగు డిసెంబర్ 26:** 1983 నుంచి తెలుగుదేశం పార్టీలో నిరంతరంగా పనిచేస్తున్న కార్యకర్తలకు ఇప్పటికీ సరైన గుర్తింపు లభించడం లేదని, తమ సామాజిక వర్గాన్ని పార్టీ నాయకత్వం పూర్తిగా విస్మరించిందని మోదుగుల నరసింహులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.రాజంపేట నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జి పై ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు."జగన్మోహన్ రాజు ఒక 420. ఆయన అసలు తెలుగుదేశం కార్యకర్తగా పనిచేస్తున్నారా? లేక వైసీపీ కార్యకర్తగా వ్యవహరిస్తున్నారా?" అని ప్రశ్నించారు. క్షేత్రస్థాయి నిజాలు బయటపడాలి రాజంపేట నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై క్షేత్రస్థాయి నుంచి ఇంటెలిజెన్స్ రిపోర్ట్ తెప్పించాలని ఆయన డిమాండ్ చేశారు."గ్రౌండ్ లెవెల్‌లో ఎవరు పార్టీ కోసం పని చేస్తున్నారు? ఎవరు పార్టీని లోపల నుంచే దెబ్బతీస్తున్నారు? అన్నది ఇంటెలిజెన్స్ రిపోర్ట్‌లో స్పష్టంగా తెలుస్తుంది" అని అన్నారు. అసలైన కార్యకర్తలకు న్యాయం చేయాలి పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను పక్కన పెట్టి, అనుమానాస్పద నాయకత్వాన్ని ప్రోత్సహించడం వల్ల పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని హెచ్చరించారు. "అసలైన కార్యకర్తలకు న్యాయం చేయండి. కార్యకర్తలను బతకనీయండి. అప్పుడే పార్టీ బతుకుతుంది" అని స్పష్టం చేశారు.విసుగు తుది దశకు చేరింది. ఇలాంటి నాయకులతో ఇక పనిచేయలేమని, పార్టీ తీరు మారకపోతే తీవ్ర నిర్ణయాలు తప్పవని మోదుగుల నరసింహులు హెచ్చరించారు."మాకు విసుగు వచ్చింది. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడకపోతే బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నాం" అని ఆయన స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు రాజంపేట రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. తెలుగుదేశం అధిష్ఠానం ఈ అంశంపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

## మొక్కలను జాగ్రత్తగా సంరక్షించి.. పెంచుకోవాలి..




**మహానంది, పల్లె వెలుగు :** ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రైతులకు పొలంగట్లపై పెంచుకోవడానికి అందజేసిన మొక్కలను జాగ్రత్తగా సంరక్షించి వృక్షాలుగా పెంచేందుకు అధికారులు మరింత అవగాహన కల్పించాలని జడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహానంది మండల తిమ్మాపురం గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహబూబ్ల ఆధ్వర్యంలో మండల ఉపాధ్యక్షురాలు కుంచెపు లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ రమాదేవి మాట్లాడుతూ.. రీ సర్వే పూర్తయిన మూడు గ్రామాల్లో త్వరలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తామన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల వేదిక కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కరెంటోల్ల జన బాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్న వాటిని గుర్తించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రబీ సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామాల్లోని రైతులు రబీ సీజన్లో వేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంఈఓ రామసుబ్బయ్య మాట్లాడుతూ.. తిమ్మాపురం గ్రామంలోని జడ్పీ పాఠశాలలో గదులు దెబ్బతిన్నాయని వాటిని మరమ్మతులు చేయడానికి లేదా తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఎంపీడీవో మహబూబ్ దౌలా మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై సర్పంచులు, ఎంపిటిసిలు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో మల్లికార్జున, ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత, ఎంపీహెచ్ఈవో హుస్సేన్ రెడ్డి,డిప్యూటీ ఎంపీడీ వోలు సంజీవ, భార్గవీలత, సర్పంచులు కళ్లె శ్రీలక్ష్మి, కందుల వరలక్ష్మి,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రక్షకుడు మీ కొరకు పుట్టి ఉన్నాడు ,,,,,

### రెండవ రోజు ఘనంగా క్రిస్మస్ సంబరాలు,,,,,,






**నందవరం పల్లె వెలుగు డిసెంబర్26** నందవరం మండలంలో కనకవీడు గ్రామంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి పిల్లలు పెద్దలు గ్రామ ఎంప్లాయిలు కలసి సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని ప్రార్థించాలని వారు తెలిపారు దావీదు పట్టణము మందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు ఆయనే నజరేయుడైన ఏసుక్రీస్తు బెత్లహేము గ్రామంలో కన్యక గర్భవతి అయినా మరియా కుమారుని కన్నును ఆయనే ఏసుక్రీస్తు, ఆయనను ఆరాధిస్తూ ప్రార్థిస్తూ ఘనంగా క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో పాస్టర్ పురుషోత్తం, యువరాజ్, మహిళలు చిన్నారులు ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు





## కర్నూలులో 'నో హెల్మెట్ నో పెట్రోల్' ప్రచారం

### - ఎస్పీ సూచనల మేరకు ఎస్డీపీఓ సమావేశం







**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** కర్నూలు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్, ఐపిఎస్ సూచనల మేరకు ఎస్డీపీఓ బాబు ప్రసాద్ కుర్నూల్ నగరంలోని పెట్రోల్ బంక్ యజమానులతో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 30, 2025 నుంచి 'నో హెల్మెట్ నో పెట్రోల్' ప్రచారాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు.సమావేశంలో మాట్లాడిన ఎస్డీపీఓ బాబు ప్రసాద్, హెల్మెట్ ధరించకుండా వచ్చే రైడర్లకు పెట్రోల్ ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఈ నియమాన్ని పూర్తిగా పాటించడం ద్వారా రోడ్డు దుర్ఘటనలను అరికట్టవచ్చని, ప్రజా భద్రతను పెంచవచ్చని తెలిపారు. ట్రాఫిక్ సిఐలు కూడా ఈ ప్రచారంలో పూర్తి సహకారం అందించాలని సూచించారు.

**కీలక వివరాలు**

- ప్రారంభ తేదీలి: డిసెంబర్ 30, 2025 నుంచి అమలు
- లక్ష్యం: హెల్మెట్ ఉపయోగాన్ని పెంచడం, ప్రమాదాలు 60% తగ్గించడం
- బాధ్యత: పెట్రోల్ బంక్ యజమానులు, ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు పోలీసులు ఇటీవల హెల్మెట్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లుగా తెలుస్తోంది. తిరుపతి వంటి ప్రాంతాల్లో ఇదే నియమం విజయవంతంగా అమలవుతోంది. పెట్రోల్ బంక్ యజమానులు ఈ సమావేశంలో పూర్తి సహకారం తెలిపారు.

# కనివిని ఎరుగని రీతిలో సమ్మక్క సారలమ్మమహా జాతర నిర్వహణ పనులు

## మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి.



**ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 26, (పల్లె వెలుగు):** ప్రపంచ చరిత్రలోనే సమ్మక్క సారలమ్మ మహా జాతర నిర్మాణ పనులు ఒక మైలు రాయిగా నిలిచిపోతాయనీ ,నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ ,పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అనసూయ పేర్కొన్నారు. 4 వేల టన్నుల గ్రానైట్ పై ఆదివాసీ చరిత్ర సంస్కృతి తెలియజేసే 7,000 బొమ్మలతో సమ్మక్క సారలమ్మ నిర్మాణం పనులు వేగవంతంగా సాగుతున్నాయని స్పష్టం చేశారు.

శుక్రవారం ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క సారలమ్మ పునర్ నిర్మాణం పనులు పరిశీలించేందుకు హైదరాబాదు నుంచి మీడియా ప్రతినిధుల బృందం వచ్చింది. సమ్మక్క సారలమ్మ చరిత్ర ,పునర్నిర్మాణ నిర్మాణ పనులు ఆదివాసీల మూలాలు జాతర చరిత్రను మీడియా బృందానికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ

మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరను ఈసారి కొత్త రూపుతో.. వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈసారి ఎప్పుడూ కల్పించే తాత్కాలిక సౌకర్యాలతోపాటు శాశ్వత నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎన్నడూ లేనివిధంగా రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఇందులో ప్రధానంగా వనదేవతల గద్దెల విస్తరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందనీ ఈ పనులకే రూ.101 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.

పునరుద్ధరణ పనులు చేపట్టే సమయంలో గిరిజన పూజారులతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి పూజారుల సంఘం అభిప్రాయం తీసుకుని పూజారులను ఒప్పించడం జరిగిందని, ఒకే లైన్లో వన దేవతలు ఉండడం వలన భక్తులు దర్శనాలు చేసుకోవడానికి సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. పూర్వకాలంలో గిరిజనులకు పసుపుతో ఎంతో బంధం ఉందని, శాస్త్రీయంగా పసుపుతో పలు వ్యాధులను నయం చేసుకునే అవకాశం ఉందని దీనిని వాడకం చేయడం వలన పూర్వం లో ఆదివాసులు ఎలాంటి వ్యాధుల బారిన పడిన పసుపును వాడుకున్నారని తెలిపారు. సమ్మక్క తల్లి గోత్రం బండారి గోత్రమని, తమ ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం ప్రతి పనిని కుడి నుండి ఎడమవైపు నడుస్తుందని, నవగ్రహాలు సైతం కుడి నుండి ఎడమవైపే తిరుగుతున్నాయని వివరించారు. స్వస్తిక్ ఏర్పాటు చేసే విషయంలో సైతం పకృతి సిద్ధాంతాన్ని ఆచరించామని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులు ఒకే వరుస క్రమంలో సులభతరంగా దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతర కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా జరుపుతామని మంత్రి తెలిపారు.

చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తున్నామని భక్తులందరూ విజయవంతనికి కృషి చేయాలని సహకరించాలని కోరారు.ఆదివాసిల సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ ప్రతి నిర్మాణం చేపడుతున్నామని సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఆదివాసి పూజార్ల సంఘం ప్రతినిధుల ఆమోదంతోనే పునర్నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. చరిత్రలో సుమారు 250 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడ రాజీ పడకుండా పనులు చేపట్టేలా ప్రతినిత్యం సమీక్షిస్తున్నామని నిత్యం మంత్రుల బృందం పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తూ పనులు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరలో పూర్తికానున్నాయని. తెలిపారు గతంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సందర్శించారని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు ఆదివాసీలు ఆలయాన్ని విస్తరించాలని కోరగా అధికారంలోకి రాగానే తప్పకుండా ఆలయాన్ని పునర్నిర్మిస్తామని మాట ఇచ్చి నేడు నిలుపుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి 251 కోట్లు మంజూరు చేశారని మేడారం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని పనులను వేగవంతం చేస్తున్నారని నిత్యం నిర్మాణం పనులను సమీక్ష చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్ హాయంలో తాత్కాలిక పనుల పేరిట నిధులను ఖర్చు ఇప్పుడు అలా కాకుండా ప్రభుత్వం పక్కా పకడ్బందీ వ్యూహంతో శాశ్వతంగా నిర్మాణ పనులు చేపడుతున్నదని చెప్పారు. చరిత్రలోనే కనివీని ఎరుగని రీతిలో ఈ దఫా సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నామని భక్తులంతా సహకరించాలని పేర్కొన్నారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నామని. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుందన్నారు. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయి అని వివరించారు గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల





వెడల్పున ప్రధాన స్వాగత తోరణం ఉంటుంధని తెలిపారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

**శిలలపై ఆదివాసీల సంస్కృతి పెద్దపీట వేస్తున్నాం..**

శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా వివరించారు. ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే 59 బొమ్మలు చెక్కించామని పేర్కొన్నారు. దాదాపు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించి ఏడు వేల బొమ్మలుంటాయని పేర్కొన్నారు. డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 250 మంది శిల్పులు పనిచేశారనీ, స్థపతులు ఈమని శివనాగిరెడ్డి, డాక్టర్ మోతీలాల్ పర్యవేక్షిస్తున్నారనీ చెప్పారు సమ్మక్క-సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్కు చెందిన 15 మంది విద్యార్థులు ఈ చిత్రాల రూపకల్పనలో సాయం అందించారని పేర్కొన్నారు

గద్దెల ప్రాంగణానికి సమీపంలో ఇదివరకు ఉన్న చెట్లను దాదాపు తొలగించకుండానే అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వనదేవతల పూజల్లో విశిష్టత కలిగిన బండారి, మర్రి, వెదురు, బూరుగ, వేప, ఇప్ప, కస్తు వంటి 12 రకాల చెట్లు, 140 రకాల ఆయుర్వేద మొక్కలు నాటనున్నామని పేర్కొన్నారు.

**పనుల వేగ పంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష..**

మేడారం ఆలయంలో పునర్నిర్మాణ పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నది. పనులను పరిశీలిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నది. పనుల్లో పూర్తి నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏది అవసరం పడిన వెంటనే తెప్పిస్తున్నారు. అధికారుల పురమయిస్తూ పనులు వేగవంతానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రతి రోజు పనుల వేగవంతం పై అడిగి తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. త్వరలో అన్ని పనులు పూర్తీ అవుతాయి.మంత్రుల బృందాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులకు ఆదేశాలిస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు. ఈసారి సమ్మక్క సారలమ్మ జాతరను బ్రహ్మాండంగా విజయవంతం చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రుల బృందం ప్రతిరోజు పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేస్తున్నది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఈ ఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, స్థపతి శివనాజిరెడ్డి, మైపథి అరుణ్ కుమార్, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి అండగా ఉంటాం...

## కాంగ్రెస్ పార్టీ నాయకులు గోకమల్ల కర్ణాకర్....

**నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26 (పల్లె వెలుగు ):** రాచూర్ గ్రామానికి చెందిన మల్లోజు అనిల్ కుమార్ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు గోకమల్ల కర్ణాకర్ గారు తన స్వంత%శీ% గా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 15000రూపాయల ఆర్థిక సహాయ గ్రామస్థుల సమక్షంలో అందజేశారు.

వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్బంగా కర్ణాకర్ మాట్లాడుతూ అనిల్ కుమార్ పిల్లల విద్యకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు.వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, గ్రామస్తులు కొంగళ్ళ యాదయ్య, మల్లయ్య, బీరయ్య, గుత్తి సత్యనారాయణ, సాకలి లింగమయ్య, జంగయ్య, గంగాధరి ఆంజనేయులు, తుప్పల శ్రీనివాస్, చాకలి కృష్ణయ్య, గుత్తి యాదయ్య,గుత్తి బాలకృష్ణ, పల్లెమోని యాదగిరి,సుధీర్ కుమార్,చెన్నయ్య, డొక్కు రాజు,వార్డు సభ్యులు పడకంటి వెంకటేష్, రామార్జున్, చంద్ర శేఖర్, ప్రేమ్ కుమార్, యువకులు పబ్బల వెంకటేష్, జగదీష్, శివకుమార్, సతీష్,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రవల్లి సమస్యపై కూనంనేని సాంబశివరావుకు వినతి.



**చారగొండ డిసెంబర్ 26 పల్లె వెలుగు దినపత్రిక:** గత కొంతకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యను శాసనసభలో చర్చించాలని ఎర్రవల్లి గ్రామ పంచాయతీ భూ నిర్వాసితులు సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ను కోరారు. శుక్రవారం హైదరాబాద్ లోని మాగ్దూం భవన్లో సిపిఐ కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎమ్మెల్యే కోణం లేని సాంబశివరావు ఎర్రవల్లి భూనిర్వాసితులు కలిసి తమ గోడును చెప్పుకున్నారు. డిండి - నార్లాపూర్ జలాశయ సామర్థ్యాన్ని తగ్గించి గ్రామాన్ని ముంపు బారి నుంచి కాపాడాలని గత 25 రోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడంలేదని గ్రామస్తులు వాపోయారు. తమకు ఏమాత్రం ఉపయోగం లేని జలాశయ నిర్మాణాన్ని రద్దు చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని పలుమార్లు కలిసిన ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోయారు. వినతి పత్రం స్వీకరించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సానుకూలంగా స్పందించి, ఈ విషయంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ప్రకాష్, పెద్దయ్య గౌడ్, ఆంజనేయులు గౌడ్, రామచంద్రయ్య గౌడ్, సూగూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# రజక ఆకాంక్ష సభలకు రజక సోదర సోదరీమణులు తరలి రండి



**సిరివెళ్ల (పల్లె వెలుగు)** నంద్యాలలో ఈనెల 28న ఆర్కే ఫంక్షన్ హాల్లో రజక ఆకాంక్ష సభకు రజక సోదర, సోదరీమణులు తరలివచ్చి సభను విజయవంతం చేయాలనీ అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రజక కోరారు. ఈ సందర్భంగా అఖిలభారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రజక మాట్లాడుతూ నంద్యాలలో జరిగే రజక ఆకాంక్షసభ ను విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి పాల్గొంటారని, ఇందులో కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రజక సంఘం గోస్పాడు మండల అధ్యక్షులు మదిలేటి, నడిపి సుబ్బరాయుడు, పెద్దమదిలేటి, తదితరులు పాల్గొన్నారు.

# రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణే..







**రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే చూస్తూ ఊరుకోం**

**పోస్టర్లపై జంతు రక్తం చల్లి భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతి ఏమిటి?**

**గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టిన పోలీసులకు అభినందనలు**

**అతిపెద్ద ఆధ్యాత్మిక క్షేత్రానికి తరలివచ్చే భక్తులకు భరోసాగా పోలీసులు**

**తిరుపతిలో నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**తిరుపతి,చీఫ్ బ్యూరో డిసెంబర్26 పల్లె వెలుగు**

ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం, కలియుగ వైకుంఠమైన తిరుమల పవిత్రతను కాపాడుతూ, భక్తులకు పూర్తి రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు భద్రతా భావం కల్పించే బాధ్యత పోలీసులదేనని సీఎం అన్నారు. తిరుపతిలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని హెూం మంత్రి వి.అనితతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం అక్కడే ఉన్న విజిటర్స్ పుస్తకంలో సీఎం తన అభిప్రాయాలను, సూచనలను రాశారు. అంతకుముందు సీఎం పోలీసు దళం నుంచి గౌరవ వందనం స్వీకరించారు. టెక్నాలజీని వాడుకుని నేర నియంత్రణ చేయాలని, డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించి విజువల్ ఆధారాలను సేకరించాలని సూచించారు. నేరస్తుల కంటే పోలీసులు ఎక్కువ ఆలోచించగలగాలని.. వారెన్ని డ్రామాలు ఆడినా టెక్నాలజీ సాయంతో పట్టుకోవాలని స్పష్టం చేశారు. నేరస్తుల కంటే పోలీసులు తెలివిగా వ్యవహరించాలని సీఎం అన్నారు. ఈ విషయంలో విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కలియుగ వైకుంఠమైన శ్రీవేంకటేశ్వరస్వామి నెలకున్న ఈ ప్రాంత పవిత్రతను కాపాడేలా పోలీసులు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీసు వ్యవస్థ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భక్తులకు ఎక్కడా చిన్న అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

**రౌడీయిజంపై ఉక్కుపాదం**

రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కొందరు రాజకీయ ముసుగులో ఉండి రౌడీయిజం చేస్తామంటే కుదరదని... సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. రౌడీయిజం చేసే వారిని రాష్ట్ర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.





అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా సరే జైలుకు పంపిన చరిత్ర తమదని సీఎం వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా భ్రష్టు పట్టాయని, తిరుమల పవిత్రతను దెబ్బతీశారని విమర్శించారు. రోడ్లు బ్లాక్ చేయటం, రప్పా రప్పా లాడించటం ఏమిటో ఎవరికీ అర్థం కావటం లేదన్నారు. బంగారు పాళ్యంలో మామిడి కాయలు తొక్కించారని.. గుంటూరులో ఓ వ్యక్తిని కాన్వాయ్ కింద తొక్కించి పొదల్లో పారేసి పోయారని అన్నారు. ఆ తర్వాత అంబులెన్సులో తీసుకెళ్లి చంపేశారని వారి బంధువులతో చెప్పించారని సీఎం వ్యాఖ్యానించారు. ఈ తరహా ఘటనల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధారాలు పెట్టుకోవాలన్నారు. రోడ్లు బ్లాక్ చేయడం, కత్తులతో జంతు బలులు ఇచ్చి పోస్టర్లపై రక్తం చల్లి సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ, అసభ్య పోస్టులు పెట్టే వారిపై ప్రభుత్వం నిఘా ఉంచిందని సీఎం






## సుపరిపాలన దినోత్సవ కార్యక్రమం

**నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26 (పల్లె వెలుగు ):**

శుక్రవారం నాగర్కర్నూల్ జిల్లా బిజెపి కార్యాలయంలో భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్ పేయ్ జన్మదినము సందర్భంగా సుపరిపాలన దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు శాంతి కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఢిల్లీ ఆచారి మాజీ జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్ జిల్లా ఆఫీస్ సెక్రటరీ సి చందు రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ సుధాకర్ రెడ్డి, నారాయణ చారి , మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పోల్దాస్ రాము మండల అధ్యక్షులు శ్రీరాములు చిన్నారెడ్డి సుదర్శన్ యశ్వంత్ సర్పంచులు పిట్టల శంకర్ బిజెపి నాయకులు కార్యకర్తలు మొదలగువారు పాల్గొనడం జరిగింది

## ఒంటిమిట్ట మండలం లో హిందూ సమ్మేళనం



**ఒంటిమిట్ట పల్లె వెలుగు ప్రతినిధి:**

దేశవ్యాప్తంగా రాష్ట్రీయ స్వయం సేవ సంఘం వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా లక్ష ప్రదేశాలలో హిందూ సమ్మేళ నాలు జరుగుతున్నాయి ఈ సందర్భంగా దాదాపుగా నాలుగువేల నుండి 5000 వరకు వస్తారని అంచనా తో ఈ సభను ప్రతి ఒక్క హిందువు బంధువులు అందరూ హాజరు కాగలరని విరివిగా పాల్గొని కార్యక్రమం ను జయప్రదం చేయగలరని విజ్ఞప్తి వేదిక. శ్రీ కోదండ రామ స్వామి కళ్యాణ వేదిక ఒంటిమిట్ట కడప జిల్లా తేదీ 28 12. 2025 మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం సనాతన హిందూ ధర్మాన్ని అనుసరిస్తున్న హిందువులందరికీ హృదయపూర్వక ఆహ్వానం

ముఖ్య అతిథులు
శ్రీ శ్రీ శ్రీ వీరజానంద స్వాములవారు
అచలానంద ఆశ్రమం బ్రహ్మంగారిమఠం
ముఖ్య వక్త శ్రీ జైపాల్ రెడ్డి గారు (ఆర్ఎస్ఎస్ జిల్లా బౌద్ధిక్ ప్రముఖ)
ముఖ్యఅతిథి శ్రీమతి కోటగుడ్డం నిర్మలానంద లక్ష్మి. రాష్ట్రీయ సామాజిక సమరసత సంఘటన్ మహిళా ప్రెసిడెంట్.

# భారత్ సూపర్ పవర్ కావడం ఖాయం

















## వేల ఏళ్ల క్రితమే ప్రపంచానికి నాగరికత పరిచయం చేసిన దేశం మనది

## సంస్కృతి-విజ్ఞానాలతో పరిఢవిల్లిన చరిత్ర మన సొంతం

## సున్నాను ఆవిష్కరించాం...భవిష్యత్తులో మరెన్నో ఆవిష్కరణలు చేయాలి

## దేశ సంస్కృతిని పరిరక్షిస్తూ... దేశాభివృద్ధికి ఆర్ఎస్ఎస్ చీఫ్ చేస్తున్న కృషి శ్లాఘనీయం

## తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

**తిరుపతి చీఫ్ బ్యూరో, డిసెంబర్ 26 పల్లె వెలుగు**

భారతదేశం త్వరలోనే సూపర్ పవర్ కావడం ఖాయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభ సదస్సుకు సీఎం చంద్రబాబు శుక్రవారం హాజరయ్యారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ తో కలిసి సందర్శించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన వివిధ యుద్ధ పరికరాల నమూనాలను సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సీఎం సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."సంస్కృతి, సంప్రదాయాలను నిలబెడుతూ.. దేశాభివృద్ధి కోసం ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ కృషి చేస్తున్నారు. మన దేశం, భారతీయత గురించి చర్చించుకోవడానికి భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ మంచి వేదిక. ప్రాచీన కాలంలోనే భారతదేశం విజ్ఞానాన్ని సముపార్జించిన దేశంగా పరిఢవిల్లింది. ఎన్నో వేల ఏళ్ల క్రితమే అర్బన్ ప్లానింగ్ అంటే ఏమిటో హరప్పా నాగరికత ద్వారా చాటి చెప్పాం. 2900 ఏళ్ల క్రితమే యోగాభ్యాసం చేశాం... ఇప్పుడు 150 దేశాలు యోగాను పాటిస్తున్నాయి. యోగా పాటిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించాం. 2600 ఏళ్ల క్రితమే భారత దేశం ఆయుర్వేదం ద్వారా వైద్య సేవలు అందించింది. పూర్వ కాలంలోనే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తక్షశిల విశ్వ విద్యాలయం నిర్మించుకున్న దేశం మన భారత దేశం. 1600 ఏళ్ల క్రితమే నలంద యూనివర్శిటీ ద్వారా ఆధునిక విద్యను అందించిన ఘనత మనది... జీరోను భారతీయులే కనుగొన్నారు. మెదడుకు పదును పెట్టే చదరంగ క్రీడను కనిపెట్టిన ఘనత కూడా మన భారతీయులదే. వివిధ కీలక రంగాల్లో నైపుణ్యం సాధించిన నిపుణులు మన భారత దేశం సొంతం. అస్ట్రానమీలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరక, ధన్వంతరి, ఆర్థిక శాస్త్రంలో కౌటిల్యుడు వంటి గొప్ప వారున్నారు. వీళ్లందరూ మనకు స్ఫూర్తిని కలిగించేలా చరిత్ర సృష్టించారు."అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

### 2 వేల ఏళ్ల క్రితమే అగ్రదేశంగా భారత్

"మన భారతీయ విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు... మరింత విస్తృత పరిచేందుకు భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ అద్భుతంగా కృషి చేస్తోంది. దక్షిణ భారత దేశంలో ఏడవ భారతీయ విజ్ఞాన్ సమ్మేళనాన్ని తిరుపతిలో నిర్వహించడం ఆనందంగా ఉంది. పవిత్ర ప్రాంతమైన తిరుపతిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు... వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉంటాయి. అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్, స్పెయిన్, జర్మనీ, రష్యా, జపాన్ వంటి దేశాల్లో 2 వేల ఏళ్ల క్రితం భారత దేశానికంటే ఎంతో వెనుకబడి ఉన్నాయి. 2 వేల ఏళ్ల క్రితం ప్రపంచంలోనే భారత దేశం 40 శాతం జీడీపీని కలిగి ఉండేది. నాలెడ్జ్ ఎకానమీలో భారత్ ఎప్పుడూ సూపర్ పవర్ గానే ఉండేది... కానీ విదేశీ పాలన, స్వాతంత్ర్యం వచ్చాక మనం చేసుకున్న కొన్ని పాలసీల వల్ల దేశం ఇబ్బంది పడింది. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చాయి... ఐటీ రెవల్యూషన్ అందిపుచుకున్నాం. వివిధ దేశాల్లోని ప్రముఖ సంస్థలకు భారతీయులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2047 నాటికి భారత దేశం ప్రపంచంలో నెంబర్-1 స్థానంలో నిలుస్తుంది. ప్రతి జంట ముగ్గురు పిల్లలు కనాలని మోహన్ భగవత్ చెబుతున్నారు... నేనూ అదే చెబుతున్నా. ఇప్పుడు మన జనాభానే ఆస్తిగా మారారు. కొన్ని దేశాలు వయోభారం సమస్యతో ఇబ్బంది పడుతున్నాయి. మనకు ఆ ఇబ్బంది లేదు. తిరుగులేని యువశక్తితో కూడిన దేశం మనది. ఈ సంపదే మన దేశాన్ని అగ్ర భాగంలో నిలుపుతుంది. భారతదేశం నెంబర్-1 స్థానంలోకి వెళ్లనున్న సందర్భంలోనే పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గే వ్యవస్థను రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. గంగా-కావేరీ నదుల అనుసంధానం అనేది జరగాలి... అప్పుడు నీటి భద్రత కలుగుతుంది. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో భారత దేశం ఛాంపియన్. దేశాభివృద్ధికి వాజ్ పేయి పునాదులు వేశారు... ఇప్పుడు ప్రధాని నరేంద్ర అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. వినూత్న ఆలోచనలు చేయాలి... కొత్త ఆవిష్కరణలు చేపట్టాలి. భారత దేశం భవిష్యత్తులో సూపర్ పవర్ గా మారబోతోంది. ఇదే సమయంలో దేశాన్ని ప్రపంచ దేశాల ముందు ప్రత్యేకంగా నిలబట్టేంది మన విలువలు, సంప్రదాయాలే. ఆ దిశగా మోహన్ భగవత్ కృషి చేస్తున్నారు. విలువలు, నైతికత వంటి అంశాలను పెంపొందించేందుకు మోహన్ భగవత్ గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నారు. భారతదేశంలో అద్భుతమైన కుటుంబ వ్యవస్థ ఉంది. అందరికీ భద్రత కల్పించేలా మన కుటుంబ వ్యవస్థ ఉంటుంది. మన పురాణాల గురించి పిల్లలకు సోదాహరణంగా వివరించాలి. మన పురాణ పురుషుల గొప్పదనాన్ని యువతకు తెలియచెప్పాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

### ఏపీ అభివృద్ధి చెందేలా ప్రణాళికలు

"ఏపీలో టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు చేపడుతున్నాం. క్వాంటం, ఏఐ వంటి వాటితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. త్వరలోనే ఏపీ నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేట్ చేయబోతున్నాం. టెలికాం సంస్కరణలతో కనెక్టివిటీ పెరిగింది. స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎయిరో స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, మెడ్ టెక్ పార్క్ వంటి వాటిని ఏర్పాటు చేస్తున్నాం. గూగుల్ పెద్ద ఎత్తున పెట్టుబడులు విశాఖలో పెట్టబోతోంది. అలాగే ఇంకా చాలా కంపెనీలు ఏపీకి రాబోతున్నాయి. ప్రాంతాల వారీగా ఏయే రంగాల్లో అభివృద్ధి చేయవచ్చో ప్రణాళికలు వేసుకుని రూపొందించాం."అని సీఎం వెల్లడించారు. ఈ సందర్భంగా ఇండియాస్ నాలెడ్జ్ సిస్టమ్స్ అనే పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, ప్రొఫెసర్ భారత్, డాక్టర్ సతీష్ రెడ్డి, సంస్కృత విద్యాపీఠం కులపతి జీఎస్ఆర్కే శాస్త్రి పాల్గొన్నారు.



# ఆలయ అర్చకునిపై దాడి..



**నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26 (పల్లె వెలుగు ):** పాలెం గ్రామంలోని అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో పూజారి ఖానాపురం సురేష్ శర్మ పై రెడ్డి రెడ్డి వెంకటేశ్వర రెడ్డి అనే వ్యక్తి అకారణంగా దాడి చేశారు.ఆలయ కమిటీకి,స్థలదాతలకు గత కొంత కాలంగా మనస్పర్థలు రావడంతో ఆగ్రహంతో దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న సురేష్ శర్మ పై దుర్భషలాడుతూ,చెయ్యి చేసుకున్నారు.అకారణంగా తన పై జరిగిన దాడికి ఆలయంలోనే సురేష్ శర్మ నిరసనకు దిగగా ఖానాపురం,పాలెం గ్రామ యువకులు, అధిక సంఖ్యలో ఆ ప్రాంతానికి వచ్చి గుమి కూడి నిరసన తెలుపుతూ.. మద్దతు ఇచ్చారు..సురేష్ శర్మ తండ్రి గారైనా కీ.శే. మురళీధర్ రావు హయాంలో స్థానికుల సహకారంతోఈ దేవాలయాన్ని శాయశక్తుల కృషి చేసి అభివృద్ధి చేశారని,ఎల్లప్పుడూ భక్తులకు అందుబాటులో వుండే అర్చకునిపై దాడి జరగడం హేయమైన చర్య అని బి.ఎస్.పి పార్టీ నాయకులు బోనాసి రామచందర్,బిజెపి నాయకులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి,పాలెం సర్పంచి,కమిటీ సభ్యులు పలు ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేయగా వెంటనే నాగర్ కర్నూల్ డి.ఎస్పి బుర్రి శ్రీనివాసులు అక్కడి చేరుకొని పరిస్థితిని సమీక్షించి సమస్య సద్దుమనిగే విధంగా చర్యలు తీసుకున్నారు..

దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి..

ధూప దీప నైవేద్యం అర్చక సంఘం అధ్యక్షులు జె చంద్రశేఖర్ నిందితునిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ ధూప దీప నైవేద్య పథకం అర్చక సంఘం అధ్యక్షులు జె చంద్రశేఖర్,బ్రాహ్మణ సంఘం నాయకులు,పరశురామ్ సేవా సంస్థ ప్రతిధులు హరికృష్ణ,మురళీధర్ రావు,తదితరులు పాల్గొన్నారు.

# రేఖా నర్సింగ్ హెూమ్ (ప్రైవేట్ ఆసుపత్రి




## వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూల్ పార్లమెంట్ సమన్వయకర్త,,,,,
## మాజీ ఎంపీ బుట్టా రేణుక భర్త బుట్టా శివ నీలకంత ఆసుపత్రిని సందర్శించారు.,,,,

**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్26**
ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలు, చికిత్స విధానాలపై నిర్వాహకులతో వివరంగా చర్చించారు.ఎమ్మిగనూరు పట్టణానికి తోడు నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామాల నుంచి ఎక్కువగా నిరుపేద ప్రజలు వైద్య చికిత్సల కోసం పట్టణానికి వస్తుంటారని పేర్కొన్నారు.అటువంటి వారికి వెసులుబాటుగా, అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు.ప్రజలు డాక్టర్లను దైవాంశ సంభూతులుగా భావిస్తారని, వైద్య వృత్తి సేవాభావంతో కూడిన మహత్తర బాధ్యత అని తెలిపారు.పేదలకు మెరుగైన చికిత్సలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని, మానవతా దృక్పథంతో సేవ చేయాలని ఆకాంక్షించారు.రేఖా నర్సింగ్ హెూమ్ ద్వారా ఎమ్మిగనూరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణ మునిసిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ అహమ్మద్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముగతి వీరుపాక్షి రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యు.కె. రాజశేఖర్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కోరిశెట్టి మధుబాబు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దొరబాబు నాయుడు, మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు మహబూబ్ బేగ్, సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్, పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం అంజి, పట్టణ కార్యదర్శి గురువ మాభాష, మాజీ కౌన్సిలర్ చేనేత మల్లి, 5వ వార్డు నాయకులు ఇబ్రహీం, పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బోయ మని, బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు మంజునాథ్, 8వ వార్డు నాయకులు బండారి యల్లప్ప, బండారి హనూక్, బండారి చక్రవర్తి, ఎమ్మిగనూరు మండల కార్యదర్శి తిమ్మాపురం బజారి, నందవరం మండల బీసీ సెల్ అధ్యక్షులు బాపురం చిన్న రాముడు, సొగనూరు ఎంపీటీసీ మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ గౌడ్, కడివేళ్ల కృష్ణ, కడివేళ్ల ఉరుకుంద గౌడ్, బనవాసి ఫారం రాజ్ కుమార్, మిట్ట సోమపురం సర్పంచ్ నరసింహులు, మాసుమన్ దొడ్డి శ్రీనివాసులు, తిరుపతయ్య, పోస్ట్ శ్రీను, కోటేకల్ గ్రామానికి చెందిన తయన్న, తిమ్మప్ప, వీరేష్, రాఘవేంద్ర, పాపన్న, దైవందిన్నే కె.వి. నాగరాజు, కె.వి. భరత్, బి. శీను, బి. శివ, పెద్ద మరివీడు మాజీ సర్పంచ్ దేవేంద్ర, రామాంజినేయులు, నాగేష్, రామకృష్ణ, నభి, తదితరులు పాల్గొని వేడుకలకు అపూర్వ వైభవం చేకూర్చారు.







# క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్

## గెలిచిన జట్లకు బహుమతులు అందించిన టిడిపి మండల నాయకులు

**నందవరం పల్లె వెలుగు డిసెంబర్ 26**
డిసెంబర్ 26: మండల పరిధిలో పూలచింత గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా పూలచింత గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు బండే గురుస్వామి ఆధ్వర్యంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు.ఈ టోర్నమెంట్ కు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావు దేశాయ్,టిడిపి బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్ లు మొదటి బహుమతి 20 వేలు,మండల నాయకులు రైస్ మిల్ నారాయణరెడ్డి రెండవ బహుమతి 10 వేలు ప్రధానం చేశారు.అందులో భాగంగా టోర్నమెంట్ లో శుక్రవారం ఫైనల్ మ్యాచ్ లో పూలచింత,గుడికల్ టీంలు తలపడగా గుడికల్ టీం గెలవగా గెలిచిన టీం కు మొదటి బహుమతి కింద ఇరవై వేలు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావు దేశాయ్,పూలచింత టీం కు ద్వితీయ బహుమతి పది వేలు రూపాయలు టీడీపి మండల నాయకులు రైస్ మిల్ నారాయణరెడ్డి అందజేశారు.మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పార్థసారథి రెడ్డి కూడా హాజరైయ్యారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడికి గెలుపు కు ఓటమి తొలి మెట్టు అని గెలిచినా అహంకారం పనికి రాదని ఓటమిని గెలుపుతో సమానంగా చూడాలని సూచించారు.అనంతరం ముఖ్య అతిధులను ఆర్గనైజర్లు,క్రీడాకారులు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గజేంద్ర రెడ్డి,చిన్న కొత్తిలి బ్రహ్మనందరెడ్డి,హాలహర్వి ప్రభుదాసు,గురజాల శివారెడ్డి,మిట్ట సోమపురం వీరేష్,నది కైరవాడి వీరారెడ్డి,ఇబ్రహీంపురం మారెప్ప,గణేష్,చాకలి ఈరన్న,వడ్డీ గిరి నరసింహులు,శ్రీనివాసులు మల్లికార్జున,బెస్త ఈరన్న, రియాజ్,జోహారాపురం ఏజీఖేల్, పేట రాముడు, వెంకటరాముడు,శివన్న,యరన్న,విజయ్,దస్తగిరి,హాలహర్వి బోయ ఎర్రం నాయుడు, ఎసేపు,ఆంద్రయ్య,గాలి సంసోను, తదితరులు పాల్గొన్నారు.

# పరకామణి కేసు... హైకోర్టు కీలక ఆదేశాలు

## నిందితుడు రవికుమార్ ఆస్తులపై మధ్యంతర నివేదికను కోర్టుకు సమర్పించిన రవికుమార్

## కొన్ని కీలక అంశాలపై స్పష్టత రావాల్సి ఉందన్న కోర్టు

## తదుపరి విచారణ జనవరి 5వ తేదీకి వాయిదా

తిరుమల పరకామణిలో జరిగిన చోరీ కేసు మరో కీలక దశకు చేరుకుంది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు రవికుమార్‌తో పాటు అతడి కుటుంబ సభ్యుల ఆస్తులపై ఏసీబీ మధ్యంతర నివేదికను సిద్ధం చేసి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సమర్పించింది. ఈ నివేదికను ఏసీబీ డీజీ నేరుగా కోర్టుకు అందజేయడం విశేషం.

ఈ నివేదికను స్వీకరించిన ఏపీ హైకోర్టు, దానిని పూర్తిగా పరిశీలించిన అనంతరం తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. అదే సమయంలో ఈ వ్యవహారంలో మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవసరం ఉందా లేదా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని సీఐడీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. కేసుకు సంబంధించిన దర్యాప్తు చాలా వరకు పూర్తయినట్లు కనిపిస్తున్నప్పటికీ, ఇంకా కొన్ని కీలక అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ముఖ్యంగా ఆస్తుల సమీకరణ, అక్రమ లావాదేవీలు, ఇతరుల పాత్రపై లోతైన విచారణ అవసరమని సూచించింది. తదుపరి విచారణను 2026 జనవరి 5వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.




# చిరు, వెంకీ అభిమానులకు పండగే...

**'మెగా విక్టరీ మాస్ సాంగ్' వచ్చేస్తోంది!**
**చిరంజీవి, వెంకటేష్‌ల సినిమా నుంచి కొత్త పాట అప్డేట్**
**డిసెంబర్ 30న 'మెగా విక్టరీ మాస్ సాంగ్' విడుదల**
**రేపే సాంగ్ ప్రోమోను రిలీజ్ చేయనున్న చిత్ర యూనిట్**
**జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా 'మన శంకర వర ప్రసాద్ గారు'**
**అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం**

మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో, విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో నటిస్తున్న భారీ మల్టీస్టారర్ 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా నుంచి చిత్ర బృందం ఓ కీలక అప్డేట్ ఇచ్చింది. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం నుంచి ఓ మాస్ సాంగ్‌ను విడుదల చేసేందుకు ముహూర్తం ఖరారు చేసింది.

'మెగా విక్టరీ మాస్ సాంగ్' పేరుతో రానున్న ఈ పాటను డిసెంబర్ 30న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

ఈ పాటకు సంబంధించిన ప్రోమోను రేపే విడుదల చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఇద్దరు అగ్ర హీరోలు కలిసి స్టెప్పులేయనున్న ఈ పాటపై భారీ అంచనాలు నెలకొన్నాయి. స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తనదైన మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాలో నయనతార, కేథరిన్ ట్రెసా కథానాయికలుగా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్‌బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# క్రేజీ టాక్‌తో సాగుతున్న కొత్త సినిమాలు

## క్రిస్మస్‌కు విడుదలైన చిన్ని సినిమాల దూకుడు


క్రిస్మస్ పండుగ సందర్భంగా టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద చిన్న చిత్రాల సందడి నెలకొంది. విభిన్న కథాంశాలతో వచ్చిన ఈ సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విజయవంత అయ్యాయి. అయితే ఈ చిత్రాల తొలిరోజు వసూళ్ల వివరాలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఇందులో శ్రీకాంత్ తనయుడు రోషన్ నటించిన ఛాంపియన్ కలెక్షన్లలో అగ్ర స్థానంలో ఉండగా.. ఆది శంబాల, ఈషా, దండోరా చిత్రాలు తర్వాతి స్థానంలో నిలిచాయి. శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా, ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో వచ్చిన పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'ఛాంపియన్'. ఫుట్‌బాల్ క్రీడ నేపథ్యంలో సాగే ఈ చిత్రం పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. రోషన్ నటనకు మంచి మార్కులు పడటంతో, తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 4.5 కోట్ల గ్రాస్




వసూళ్లను సాధించి రోషన్ కెరీర్‌లోనే బెస్ట్ ఓపెనింగ్స్‌గా నిలిచింది. చాలా కాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆది సాయికుమార్ 'శంబాల'తో సాలిడ్ కంబ్యాక్ ఇచ్చారు. యుగంధర్ ముని దర్శకత్వంలో వచ్చిన ఈ సూపర్ నాచురల్ థ్రిల్లర్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తోంది. సైన్స్ మరియు దైవత్వం మధ్య సాగే ఈ చిత్రం మొదటి రోజు రూ. 3.3 కోట్ల వసూళ్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద నిలకడగా కొనసాగుతోంది. హెబ్బా పటేల్, అరుణ్ ఆదిత్ ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ థ్రిల్లర్ 'ఈషా'. బన్నీ వాస్,
వంశీ నందిపాటి సమర్పణలో వచ్చిన ఈ సినిమా ముఖ్యంగా క్లైమాక్స్ ట్విస్ట్‌లతో ఆడియన్స్‌ను భయపెట్టిస్తోంది. క్రేజీ ప్రమోషన్స్ కారణంగా ఈ చిత్రం తొలిరోజు రూ. 2.18 కోట్ల వసూళ్లను తన ఖాతాలో వేసుకుంది. నటుడు శివాజీ ప్రధాన పాత్రలో, గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం




'దండోరా'. విడుదలకు ముందు వివాదాలు చుట్టుముట్టినా, విడుదలయ్యాక సినిమాలోని కంటెంట్ బాగుండటంతో పాజిటివ్ టాక్ వస్తోంది. ఈ చిత్రం మొదటి రోజు సుమారు రూ. 1.50 కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ఇక క్రిస్మస్ సెలవులకు తోడు న్యూ ఇయర్ హాలిడేస్ కూడా దగ్గర పడుతుండటంతో, ఈ చిత్రాల వసూళ్ల రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది.



# దండోరాను ఆదరించండి

## ప్రేక్షకులకు నటుడు శివాజీ వినతి

'దండోరా'ను ఆదరించిన ప్రేక్షకులకు చిత్రబృందం ధన్యవాదాలు తెలిపింది. థియేటర్‌లో ఆడియన్స్ స్పందన చూస్తుంటే గూస్‌బంప్స్ వచ్చాయని దర్శకుడు మురళీకాంత్ అన్నారు. పల్లె కథగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'దండోరా' పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. తాజాగా చిత్రబృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా నటుడు శివాజీ మాట్లాడుతూ.. 'కొన్ని తరాలకు ఒకసారి ఇలాంటి సినిమా వస్తుంది. రెండురోజుల ముందు ప్రీమియర్స్ పడిన్లటైతే కలెక్షన్లు వేరేలా ఉండేవి. సెన్సార్ వల్ల విడుదల ఆలస్యమైంది. 'దండోరా' గురించి 2026 మొత్తం కూడా మాట్లాడుకుంటారు. విదేశాల్లో కూడా మంచి ఆదరణ లభిస్తోంది. ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నన్ని




రోజులు నేను నిద్రపోయింది కేవలం రెండు గంటలే. ఎందుకంటే ముఖం ఉబ్బుగా ఉండాలని నిద్ర మానుకున్నాను. సినిమా మొత్తం నిద్రముఖంలానే ఉంటుంది. నా పాత్రకు నేను అలా కనిపించకపోతే డైరెక్టర్ దెబ్బతింటాడు. నిద్రమానుకోమని డైరెక్టర్ నాకు చెప్పలేదు.. కానీ, నేనే అలా చేశా. సినిమా కోసం ప్రతి ఆర్టిస్టు ప్రాణం పెడతారు. అలా చేసిన సినిమానే 'దండోరా'. దయచేసి నా వ్యక్తిగత విషయాల వైపు వెళ్లకండి. నేను వాటి గురించి విడిగా చూసుకుంటాను. వాటివైపు వెళ్లకుండా ఈ సినిమాను ప్రమోట్ చేయండి. లేదంటే ఆ నింద నేను మోయాల్సి వస్తుంది. ఈ సినిమా గురించి మాత్రమే మాట్లాడండి. కావాలంటే నేను థియేటర్‌కు వస్తాను. ఏం మాట్లాడాలన్నా నేను థియేటర్‌లో మాట్లాడతాను. మంచి సినిమాను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆర్టిస్టుకు ఉంటుంది' అని అన్నారు. నేను మూడేళ్లుగా 'దండోరా' కోసం కష్టపడ్డాను. ఆ శ్రమకు తగిన ఫలితం స్క్రీన్‌పై కనిపించింది. డిసెంబర్ 25న చాలా సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. కథపై మాకున్న నమ్మకంతోనే పోటీకి భయపడకుండా విడుదల చేశాం. ఇది మూడున్నరేళ్ల కష్టం. ఈవెంట్‌లలో రెండుమూడు మాటలు దొర్లితే వాటి ఆధారంగా సినిమాను జడ్జ్ చేయకండి' అని దర్శకుడు మురళీకాంత్ కోరారు. థియేటర్‌కు వచ్చి సినిమా చూసి అభిప్రాయాన్ని తెలపాలన్నారు.

# నిరాశపర్చిన మోహన్ లాల్ వృషభ




భాషల హద్దులు దాటి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న అరుదైన నటుల్లో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ఒకరు. సహజమైన నటన, సింపుల్ బాడీ లాంగ్వేజ్, పాత్రలో పూర్తిగా లీనమయ్యే తీరు ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టాయి. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ భాషల్లోనూ మోహన్‌లాల్‌కు విశేషమైన అభిమాన వర్గం ఉంది. ఆయన సినిమా అంటే తప్పకుండా కంటెంట్ ఉంటుందనే నమ్మకం ప్రేక్షకుల్లో బలంగా ఉండటంతో, ఆయన నుంచి వచ్చే ప్రతి చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఈ నేపథ్యంలో క్రిస్మస్ కానుకగా విడుదలైన మోహన్‌లాల్ తాజా చిత్రం 'వృషభ' పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా విడుదలకు ముందు విడుదలైన టీజర్, ట్రైలర్‌లకు మంచి స్పందన లభించడంతో పాటు, మోహన్‌లాల్‌ను పవర్‌ఫుల్ పాత్రలో చూపిస్తున్నారన్న
ప్రచారం సినిమాపై హైప్‌ను పెంచింది. నందకిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రాగిణి ద్వివేది కీలక పాత్రలో నటించగా, సమర్జిత్ లంకేష్, నయన్ సారిక మరో జంటగా కనిపించారు. అజయ్, వినయ్ వర్మ, భద్రం తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. డిసెంబర్ 25న మలయాళం, తెలుగులో ఒకేసారి ఈ సినిమాను విడుదల చేశారు. అయితే థియేటర్లలో అడుగుపెట్టిన తర్వాత 'వృషభ' పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయి స్పందన రాకపోవడంతో పాటు, తొలి రోజు వసూళ్లు ట్రేడ్ వర్గాలను షాక్‌కు గురి చేశాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'వృషభ' మొదటి రోజు నెట్ కలెక్షన్లు కేవలం రూ.70 లక్షలకే పరిమితమయ్యాయి. ఇది మోహన్‌లాల్ కెరీర్‌లోనే అత్యల్ప ఓపెనింగ్స్‌లో ఒకటిగా నిలవడం గమనార్హం. మొదటి రోజు నుంచే సినిమాపై నెగటివ్ టాక్ రావడం వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపింది. కథ, కథనంలో బలహీనతలు ఉన్నాయన్న అభిప్రాయం ప్రేక్షకుల నుంచి వ్యక్తమవుతుండటంతో, వీకెండ్‌లో సినిమా పుంజుకుంటుందా అనే సందేహాలు ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. స్టార్ పవర్ మాత్రమే సరిపోదని, కంటెంట్ బలంగా లేకపోతే ప్రేక్షకులు ఆదరించరన్న వాస్తవాన్ని 'వృషభ' మరోసారి రుజువు చేసిందని చెప్పవచ్చు.

# కలెక్షన్లలోనూ ఛాంపియన్




యంగ్ హీరో రోషన్ నటించిన తాజా చిత్రం 'ఛాంపియన్' థియేటర్లలో సూపర్ జోష్‌తో దూసుకెళ్తోంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా 25న ప్రేక్షకుల ముందుకు రాగా, ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీంతో బాక్సాఫీస్ వద్ద 'ఛాంపియన్' కలెక్షన్స్ భారీగా నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా రోషన్ కెరీర్‌లోనే ఈ సినిమాకు బెస్ట్ ఓపెనింగ్స్ రావడం విశేషంగా మారింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం నైజాం ఏరియాలోనే రూ. 2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇక వరల్డ్ వైడ్ ఫస్ట్ డే కలెక్షన్స్ దాదాపు రూ. 4.5 కోట్ల గ్రాస్ వరకు చేరి అందరిని ఆశ్చర్యపరిచింది. రోషన్ గత చిత్రాలతో పోలిస్తే ఇదే అతడి కెరీర్‌లో అత్యధిక ఓపెనింగ్ రికార్డ్‌గా నిలిచింది. ఈ సినిమాకు స్వప్న సినిమాస్ వంటి పెద్ద బ్యానర్ సపోర్ట్, దర్శకుడు ప్రదీప్ అద్వైతం అందించిన పవర్‌ఫుల్ టేకింగ్ ప్రధాన బలాలుగా నిలిచాయి. అలాగే మలయాళ బ్యూటీ అనస్వరా రాజన్ నటనకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభిస్తున్నాయి. కథ, యాక్షన్ సీక్వెన్సులు, ఎమోషనల్ ఎలిమెంట్స్ సమతుల్యంగా ఉండటంతో సినిమా చూసినవాళ్లు బాగుందని చెప్పడం వల్ల వర్డ్ ఆఫ్ మౌత్ బలంగా స్ప్రెడ్ అవుతోంది. సోషల్ మీడియాలో కూడా 'ఛాంపియన్'కు పాజిటివ్ బజ్ కొనసాగుతోంది. రివ్యూలు అనుకూలంగా రావడంతో టికెట్ బుకింగ్స్ వేగంగా పెరుగుతున్నాయి. ఈ ప్రభావంతో వీకెండ్ కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సంగీత దర్శకుడు మిక్కీ జె మేయర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకి మరింత ఎనర్జీని అందించగా, మురళీ శర్మ, సంతోష్ ప్రతాప్ వంటి నటుల పర్ఫార్మెన్స్‌లు కథకు అదనపు బలం చేకూర్చాయి. మొత్తం మీద 'ఛాంపియన్' సినిమా రోషన్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తూ, బాక్సాఫీస్ వద్ద జెట్ స్పీడ్‌లా దూసుకెళుతుంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; Mahesh Babu
RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugu@gmail.com